తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

దాడి కేసులో ముద్దాయిలు కోర్టుకు హాజరు

చిల్లకూరు, అక్టోబర్ 30, ప్రభాతవార్త
ఈ నెల 22వ తేది మండలంలోని నాంచారమ్మ పేట గ్రామంలో ఈ నెల 22వ తేది చలగల కాటయ్య మల్లారపు హరిప్రసాదులపై అదే గ్రామానికి చెందిన కొందరుతో కలిసి నిద్రిస్తున్న వారిని దాడి చేసారు. ఈ దాడిలో హరిప్రసాద్ మృతి చెందినాడు. కాటయ్యకు తీవ్ర గాయాలు అయ్యి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ కేసుకు సంబంధించి జిల్లా ఎస్పి ఎల్. సుబ్బరాయుడు ఆదేశాలతో గూడూరు డిఎస్పి పివి రమణ కుమార్, రూరల్ సిఐ కిషోర్ బాబు, ఎస్ఐ సురేష్ బాబులు నాలుగు బృందాలుగా దర్యాప్తు చేపట్టడం జరుగుతుందని, దీనిలో భాగంగా బుధవారం నాంచారంపేటకు చెందిన మన్యం బుజ్జమ్మ చిల్లకూరు గ్రామానికి చెందిన అచ్చి ప్రవీణులను అదుపులో తీసుకొని కోర్టుకు హాజరు పరిచారు. ఈ కేసుకు సంబంధించి మరి కొంత మంది ముద్దాయిలు పరారీలో ఉన్నారని వారిని కూడా అదుపులో తీసుకుంటామని వారు తెలియజేశారు.

చిత్తూరు జిల్లాలో 16 కరవు మండలాలు

చిత్తూరు, అక్టోబర్ 30 ప్రభాతవార్త:
జిల్లాలో కరవు ప్రభావిత మండలాలను ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు చిత్తూరు జిల్లాలో 16 కరవు మండలాలు వున్నట్లు నిర్ధారించింది. ఇందులో యాదమరి, పెనుమూరు, గుడిపాల మండలాలు పూర్తి స్థాయి కరవు మండలాలుగా, ఎస్ఆర్‌పురం, చిత్తూరు, శాంతిపురం, రొంపిచెర్ల, పూతలపట్టు, సోమల, పుంగనూరు, పలమనేరు, బైరెడ్డిపల్లి, వి.కోట, గుడిపల్లి, కుప్పం, రామకుప్పం మండలాలను పాక్షిక కరవు మండలాలుగా ప్రభుత్వం నిర్ధారించింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో జూన్ నుండి సెప్టెంబర్ వరకు ఈ మండలాల్లో సాధారణ సగటు వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం నమోదు అయ్యింది. ఈ మేరకు ప్రభుత్వం కరవు ప్రభావిత మండలాలను గుర్తించింది.

రేపటి నుండి
ఉచిత గ్యాస్ రీ-ఫిల్లింగ్

గుడిపాల జడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభం
48 గంటల్లో వినియోగదారుడి బ్యాంకు ఖాతాలో సబ్సిడీ జమ : జాయింట్ కలెక్టర్ విద్యాధరి

చిత్తూరు, అక్టోబర్ 30 ప్రభాతవార్త:
సిఎం నారా చంద్రబాబునాయుడు శ్రీకాకుళం నుండి శుక్రవారం ఉచిత గ్యాస్ రీ-ఫిల్లింగ్ కార్యక్రమంను ప్రారంభించనుండగా జిల్లాలో ఆదే రోజు జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి, రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి గుడిపాల జడ్పీ ఉన్నత పాఠశాల నుండి జిల్లా స్థాయి ఉచిత గ్యాస్ రీ-ఫిల్లింగ్ కార్యక్రమంను లాంఛనంగా ప్రారంభించనున్నారని జాయింట్ కలెక్టర్ విద్యాధరి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో బుధవారం జాయింట్ కలెక్టర్ విద్యాధరి నవంబర్ 1 నుండి ప్రారంభం కానున్న ఉచిత గ్యాస్ రీ-ఫిల్లింగ్ పథకం అమలుకు సంబంధించి గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బిపిఎల్ తెల్ల రేషన్ కార్డు కలిగి ఆధార్ అనుసంధానం చేసుకున్న వినియోగదారులకు ప్రతి ఆర్థిక సంవత్సరానికి ఉచితంగా ఎల్‌పిజి గ్యాస్ సిలెండర్ రీ-ఫిల్లింగ్ పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 2025 మార్చి 31వ తేదీ వరకు ఒక గ్యాస్ సిలెండర్ రీ-ఫిల్లింగ్‌కు అవకాశం వుంటుందన్నారు. ఉచిత సిలెండర్ గ్యాస్ రీ-ఫిల్లింగ్‌కు సంబంధించి వినియోగదారులు ఎవ్వరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వినియోగదారుల వద్ద ఖాళీ గ్యాస్ సిలెండర్ వున్నప్పుడు ఐదు నెలల కాలంలో ఎప్పుడైనా గ్యాస్ సిలెండర్ రీ-ఫిల్లింగ్ చేసుకోవచ్చునన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత గ్యాస్ సిలెండర్ రీ-ఫిల్లింగ్ కార్యక్రమంను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. జిల్లాలో ఈ కార్యక్రమంను సమర్థవంతంగా నిర్వహించడానికి గ్యాస్ ఏజెన్సీలు పౌరసరఫరాల శాఖతో సమన్వయంతో పని చేయాలన్నారు. జిల్లాలో మొత్తం 5,43,202 తెల్ల రేషన్ కార్డులు వున్నాయని, అలాగే దీపం కనెక్షన్లు 2,44,546 కనెక్షన్లు, ఉజ్వల్ గ్యాస్ కనెక్షన్లు 12,268 వున్నాయన్నారు. జిల్లాలో మొత్తం 5,80,297 ఎల్‌పిజి గ్యాస్ కనెక్షన్లు వున్నాయని, అలాగే 47 గ్యాస్ ఏజెన్సీలు వున్నాయన్నారు. ఇందులో ఐఓసికి సంబంధించి 27, బిపిసికి సంబంధించి 9, హెచ్‌పిసికి సంబంధించి 11 ఏజెన్సీలు వున్నాయన్నారు. ఈ సమావేశంలో డిఎస్ఓ శంకరన్, సివిల్ సప్లైస్ డిఎం బాలకృష్ణ, గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవకు !

ప్రపంచప్రఖ్యాతిగాంచిన హిందువుల ఆరాధ్యదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి భక్తులకు సేవలందించేందుకు, తిరుమల తిరుపతి దేవస్థానం ఆలయ పాలనవ్యవహారాలు పర్యవేక్షణకు ఎట్టకేలకు పూర్తిస్థాయి నూతన ధర్మకర్తలమండలి నియామకమైంది. ఉమ్మడిచిత్తూరుజిల్లాకు చెందిన వ్యాపారవేత్త సుపరిచితులు, ఓ మీడియాసంస్థ అధినేత బొల్లినేని రాజగోపాల్‌నాయుడు ఛైర్మన్‌గా 24మంది సభ్యులతో బోర్డు ఖరారైంది.

ఎట్టకేలకు పూర్తిస్థాయి టిటిడి నూతన బోర్డు ఏర్పాటు
ఛైర్మన్‌గా చిత్తూరుజిల్లావాసి బిఆర్ నాయుడు -త్వరలోనే ప్రమాణస్వీకారం

తిరుమల,అక్టోబర్ 30ప్రభాతవార్తప్రతినిధి:
దీపావళి పర్వదినం కానుకగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టిటిడి బోర్డును నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ బోర్డు త్వరలోనే ప్రమాణస్వీకారం చేయనున్నారు. సామాన్యరైతు కుటుంబానికి చెందిన బిఆర్‌నాయుడు దైవభక్తికలవ్యక్తి. ఆయన శ్రీవారి సేవకుడిగా భక్తులకు సేవలందించేందుకు వస్తున్నారు. అధికార ప్రభుత్వం ఎట్టకేలకు మూడునెలల తరువాత టిటిడి ధర్మకర్తలమండలి నియమించడం పట్ల హర్షం వ్యక్తమవుతోంది. ఈ బోర్డులో పలువురు మాజీ సభ్యులుగా సేవలందించిన అనుభవం ఉన్నవారే ఉండటం విశేషం. రెండేళ్ళపాటు కొనసాగనున్న ఈ బోర్డులో 24మందిలో 12మంది రాష్ట్రానికి చెందినవారే ఉండగా మిగిలిన వారిలో తెలంగాణ నుండి 5మంది, తమిళనాడు నుండి ఇద్దరు, కర్నాటక నుండి ముగ్గురు. గుజరాత్, మహారాష్ట్రనుండి ఒక్కొక్కరు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

24మందితో పూర్తిస్థాయిలో బోర్డు ఖరారవడంతో

బిఆర్ నాయుడు నేతృత్వంలో నూతన ధర్మకర్తలమండలి పూర్తిస్థాయిలో త్వరలోనే తిరుమలకు చేరుకుని ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ సారి అధికశాతం రాష్ట్రానికి చెందిన పలువురు పార్టీ నేతలకే బోర్డుసభ్యులుగా అవకాశం దక్కింది. టిటిడి ఛైర్మన్‌గా బిఆర్ నాయుడు, సభ్యులుగా జ్యోతులనెహ్రూ(ఎంఎల్ఎ), వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి(ఎంఎల్ఎ), ఎంఎస్ రాజు(ఎంఎల్ఎ), పనబాక లక్ష్మి, జాస్తి పూర్ణసాంబశివరావు, తెలంగాణ నుండి టిడిపి విధేయుడు, అనర్గళ వక్త నర్సిరెడ్డి, బూరగపు ఆనందసాయి, సుచిత్ర ఎల్ల, మహేదర్‌రెడ్డి,అనుగోలురంగశ్రీ, కర్నాటక నుండి దర్శన్ ఆర్ఎన్, , జస్టీస్ హెచ్ఎల్ దత్, నరేశ్‌కుమార్, తమిళనాడు నుండి పి.రామ్మూర్తి, కృష్ణమూర్తి, మహారాష్ట్ర నుండి సౌరబ్‌హెచ్‌బోరా, గుజరాత్ నుండి డాక్టర్ ఆదిత్య దేశాయ్, జానకిదేవి తమ్మిశెట్టి, కుప్పంకు చెందిన శాంతారామ్ నియమతులయ్యారు. త్వరలో ఏర్పాటుకానున్న కొత్త బోర్డు భక్తులకోసం తీసుకోనున్న సంక్షేమ కార్యక్రమాలు ఎలా ఉంటాయనేది చర్చ మొదలైంది. అంతేగాక ఇప్పటికే టిటిడిలో కల్తీ నెయ్యి బాగోతం, ఇంజనీరింగ్ నిధులు మళ్ళింపు, టిటిడి ఖజానానుండి దుబారాగా నిధులు వ్యయం తదితరవాటిపై విజిలెన్స్ నివేదికలు వంటివాటిపై ఎలా ముందుకు వెళ్లనున్నారనేది ఆసక్తికరంగా మారింది.

ప్రతి భక్తుడిలో భగవంతునిచూసుకునేలా చక్కటి ,సంతృప్తికర దర్శనమ్ చేయించేలా ప్రణాళికలు రూపొందించుకోనున్నారు. తిరుమలకు వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా సౌకర్యాలు కల్పించడం, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజన్‌కు తగ్గట్లు తిరుమలలో చక్కటి వ్యవస్థ తీసుకురావడం ఈ బోర్డుపై ఉన్న బాధ్యత.

టిటిడి బోర్డు సభ్యుడిగా వైద్యం శాంతారాం

కుప్పం, అక్టోబర్ 30 ప్రభాతవార్త :టిటిడి బోర్డు సభ్యుడిగా కుప్పంకు చెందిన వైద్యం శాంతారాం నియమితులయ్యారు. బుధవార ం రాష్ట్ర ప్రభుత్వం తిరుమల తిరుపతి దేవస్థానానికి పాలకమండలిని నియమించింది. ఈ నేపథ్యంలో టిటిడి బోర్డులో కుప్పంకు చెందిన వైద్యం శాంతారాంకు స్థానం దక్కడం విశేషం. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ నాయా బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్‌గా పనిచేసిన వైద్యం శాంతారాం కుప్పం రాజకీయాల్లో తనదైన శైలిలో ముందుకుసాగుతున్నారు.

జనం లేక వెల వెల బోతున్న టపాయకాయ దుకాణాలు

పండగల్లో కానరాని ఉత్సాహం

దీపావళి చిటపటలే లేదు: పాలం పనుల్లో బిజీ బిజీ

శ్రీకాళహస్తి,అక్టోబర్ 30 ప్రభాతవార్త
గతంలో పండగలంటే ఎంతో ఉత్సాహం, వారం రోజులు ముందు నుంచి హడావిడి.మూడు రోజులు బట్టల దుకాణాలు, మూడు రోజుల పాటు కిరాణ దుకాణాల్లో జనం సందడి చోటు చేసుకునేది. అయితే గత కొన్ని సంవత్సరాలుగా పండగలంటే నిరాశ చోటు చేసుకుంటుంది.ఈ ఏడాది అక్టోబర్ చివరిలో కురవాల్సిన వాన మొదటి వారంలోనే కురవటంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.గురువారం దీపావళి.కానీ బుధవారం కూడా ఆ సందడి కనబడలేదు. శ్రీకాళహస్తి కేంద్రంగా బాణసంచా విక్రయాలు జరుగుతాయి.ఇందుకు విక్రయాలకు పట్టణానికి బయట అయ్యలనాడుచెరువులోని బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో అధికారులు అనుమతించారు. కానీ దీపావళి ముందు రోజు కూడా ఇక్కడ వ్యాపారం సందడి కనబడలేదు.శ్రీకాళహస్తికి చెందిన ప్రజలు తమిళనాడు, కార్వేటి నగరం, రేణిగుంట, శ్రీకాళహస్తిలోని గోదాముల్లో కొనుగోలు చేయటంతో దుకాణాలు వెల వెల బోయాయి.

వెల వెల బోతున్న గ్రామాలు:

ఈ ఏడాది పండగలు నిరాడంబరంగా సాగుతున్నాయి. దసరా ఊసేలేదు. ఇక దీపావళికి గ్రామాల్లో ఎక్కడా సందడి కనబడలేదు.గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది గ్రామాలు వెల వెల బోతున్నాయి. సాధారణంగా దీపావళి అంటే పట్టణంలోనూ, పల్లెల్లో బాణ సంచా శబద్దాలు దద్దరిల్లేవి.ఆకాశ చువ్వలతో మతాబులతో కన్నుల పండువగా కళ్గించేవి. కానీ ఈ ఏడాది ఆ వాతావరణమే కనబడటం లేదు.ఢాం ఢాం కాదు కదా కనీసం మతాబుల వెలుగులు కూడా లేదు.ఎప్పుడూ వ్యాపారాల్లో బిజీగా ఉండే బట్టల, కిరాణ దుకాణాలు వెల వెల బోతున్నాయి.ఇదేమి పరిస్థితి అని వ్యాపారులు తల్లడిల్లుతున్నారు. పండగ వ్యాపారాలపై నమ్మకంతో సరకులు తెచ్చుకున్న వ్యాపారులు లబోదిబో అంటున్నారు.ఇక బాణ సంచా వ్యాపారులు చేతులు ముడుచుకొని కూర్చొన్నారు. దీపావళి అంటే వన్‌టౌన్ పోలీసు స్టేషన్ మలుపు నుంచి బాబూ అగ్రహారం పాత నెల్లూరుబస్టాండు రోడ్డు, ఆర్‌టిసి సర్కిల్ నుంచి ఏరియా ఆసుపత్రిరోడ్డులో కాలుమోపటానికి వీలు పడేది కాదు.కానీ బుధవారం పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.కనీసం రోజు జరిగే వ్యాపారాలు కూడా లేదు. బస్సులు ఖాళీగా పయనం సాగిస్తున్నాయి.గ్రామాల్లో దీపావళి అమావాస్యలాగే తమ జీవితాలు చీకటిమయమయ్యాయని వాపోతున్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

665 మంది దాతల ద్వారా 765 యూనిట్లు సేకరణ
ప్రభుత్వ ఆసుపత్రులకు వితరణ

తిరుచానూరు, అక్టోబర్ 30, ప్రభాతవార్త

రక్తదానం ప్రాణదానంతో సమానం అని తిరుపతి జిల్లా ఎస్పి సుబ్బరాయుడు అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్కరణ వారోత్సవాలు పురస్కరించు కుని బుధవారం ఉదయం తిరుచా నూ రులో కన్వెన్షన్ హాల్‌లో జిల్లా పో లీస్ శాఖ వారు రక్తదాన శిబి రాన్ని ఏర్పాటు చేసారు. ఇందులో భాగంగా జిల్లా ఎస్పి సుబ్బరాయు డు రక్త శిభిరాన్ని ప్రారంభించారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా ఎపోలలీసులు, విద్యార్థులు, ఇతర ప్రజలు మొత్తం 665 మంది 765 యూనిట్ల రక్తదానం చేసారు. తరువాత సేకరించిన రక్తాన్ని ప్రభుత్వ ఆసుపత్రులకు వితరణగా అందజేసారు. తరువాత దాతలకు ఎస్పి చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల సంస్మరణ వవారోత్సవాలు సందర్భంగా అమరవీరుల త్యాగాలను, విశిష్ట సేవలను స్మరించుకుంటూ వారికి సంఘీభావం తెలిపారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీసులు, ప్రజలను భాగస్వామ్యం చేస్తూ చేపట్టిన రక్తదాన శిబిరం విజయంతంగా ముగిసిందని దాతలను అభినందించారు. రక్తదాన శిభిరంలో పాల్గొన్న పోలీసులకు ప్రజలకు, విద్యార్థులకు అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కల్యాణ వెంకన్న పవిత్రోత్సవాలకు "పూర్ణాహుతి"

వైభవంగా స్నపన తిరుమంజనం

చంద్రగిరి, అక్టోబర్ 30 ప్రభాతవార్త:
శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి వారి పవిత్రోత్సవాలలో బుధవారం ఆగమోక్తంగా పూర్ణాహుతి నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాల అర్చనాధి నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. పవిత్రోత్సవాలలో ముగింపు రోజున యాగశాల వద్ద వైధిక కార్యక్రమాల అనంతరం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకన్న ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు, చందనంతో విశేష అభిషేకం గావించి స్నపన తిరుమంజనం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ స్వామివారు తిరుచ్చిపై తన దేవేరులతో ఆలయ తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి యాగశాలలో వైధిక కార్యక్రమాలు, పూర్ణాహుతితో పవిత్రోత్సవాలను ముగించారు. తదుపరి కుంభసంప్రోక్షణ, ఆచార్య బహుమానం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపినాథ్, సూపరింటెండెంట్స్ వల్లంశెట్టి రమేష్‌కుమార్, తేనెపల్లి వెంకటస్వామి, మునిబాలకుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, ఆలయ అర్చకులు పార్థసారథి, బాలాజీ రంగాచార్యులు, నారాయణం శేషాచార్యులు, కేనమాకుల పల్లి నారాయణాచార్యులు, సిబ్బంది మోహన్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ మృతి

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 30, ప్రభాతవార్త
తిరుపతి రూరల్ మండలంలోని పూతలపట్టు - రేణిగుంట 150 బైపాస్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా వున్నాయి. తిరుపతి జిల్లా రేణిగుంట పోలీసు స్టేషన్‌లో హెచ్‌సిగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మి నారాయణ ఐదు నెలల క్రితం పాకాల పిఎస్ నుండి రేణిగుంట పిఎస్‌కు బదిలీ పై వచ్చారు. అతని భార్య పేరు పద్మావతి అతనికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కూతురు యశస్విని (15), కుమారుడు మోక్ష (14) ఉన్నారు. అతను భార్య పిల్లలుతో తిరుపతి పట్టణం నగర్‌లో కాపురం ఉంటున్నాడు. అతను 2 నెలల నుండి ఎస్‌విఆర్‌ఆర్‌లో ఓపి విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం కోర్టు, ప్రాసెస్ డ్యూటీ నిమిత్తం ఉదయం పాకాల వైపు వెళ్లి అక్కడ పని ముగించుకొని తిరిగి పిఎస్‌కు టూ వీలర్‌లో చంద్రగిరి వైపు నుండి రేణిగుంట వైపుకు వెళ్తుతుండగా వకుల మాత గుడి సమీపంలో వెళ్తుండగా టమోటా కాళీ బాక్స్‌లతో అపోజిట్ రోడ్‌లో చెర్లోపల్లి రోడ్డు వైపుకు ఓనర్ చెర్లోపల్లికి చెందిన ఐచర్ ఓనర్ నగరి నవీన్ ఇంటికి వెళ్తున్న వాహనం డ్రైవర్ నెల్లూరుకు చెందిన దారమోహన్ నిర్లక్ష్యంగా, అతివేగంగా ఎదురుగ వెళితే ప్రమాదం జరిగే మనుషులు చనిపోతారని తెలిసి కూడా అపోజిట్‌లో వెళ్లి సమయం సుమారు 10.10 గంటల సమయంలో లక్ష్మీనారాయణ నడుపుతున్న టూ వీలర్‌ను గుద్దటంతో అతను వేసుకున్న హెల్మెట్ ఊడిపడి తల ముందర బలమైన రక్తగాయం, ఎడమ కాలు విరిగి తీవ్ర రక్త గాయమై కోలుకోలేక అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం పై వారి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసుకున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ పారారైయ్యాడు.

సాయం చేసి నా భర్త ప్రాణాలను కాపాడండి

బాధితుడి భార్య అశ్విని వేడుకోలు

తిరుపతి హెల్త్, అక్టోబర్ 30, ప్రభాతవార్త
కాలేయ వ్యాధితో చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న తన భర్తకు వైద్య ఖర్చులు నిమిత్తం సాయం అందించి దాతలు తన భర్త ప్రాణాలు కాపాడాలని కలకడ మండలం గుడిబండ తెట్టు గ్రామానికి చెందిన అశ్విని వేడుకున్నారు. బుధవారం ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో తన బిడ్డలతో కలిసి సమస్యను వివరించారు. తన భర్తి కిలా రెడ్డి శేఖర్, గత నెల రోజులుగా కాలేయ వ్యాదితో తీవ్ర అవస్థలు పడుతున్నాడని తెలిపారు. రేక్కాడితే గానీ డొక్కాడనితమ గిరిజనుల బతుకులు అని ఆమె అన్నారు. అయినప్పటికీ తన కుటుంబానికి పెద్ద దిక్కు అయిన భర్తను కాపాడుకునేందుకు ఇప్పటికే ఐదు లక్షలు అప్పు చేసి చెన్నైలో గ్లోబల్ హాస్పిటల్‌లో శక్తి మేరకు చికిత్స చేయించానని తెలిపారు. అయితే కాలేయ మార్పిడి చేస్తే కానీ తన భర్త బతకడు అని అందుకు 50 లక్షలు ఖర్చుఅవుతుందని ఆసుపత్రి వైద్యులు సూచించారని కన్నీటి పర్యంతమయ్యారు. తనకు మూడు, ఆరు సంవత్సరాల చిన్నపిల్లలు ఉన్నారని తన భర్త లేకుంటే మా బతుకులు చిందరవందర అవుతాయని వాపోయారు. దాతలు సహృదయంతో స్పందించి ఆర్థిక సహాయం అందించి తన భర్త ప్రాణాలు కాపాడి తమ కుటుంబానికి ఆదరణ కల్పించాలని వేడుకున్నారు. సాయం చేసే దాతలు 9553173351 ఈ నెంబర్‌ను సంప్రదించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అకౌంట్ నెంబర్ 36922652056, ఐఎఫ్ఎస్‌సి కోడ్ ఎస్‌బిఐఎన్0012727 మదనపల్లి బ్రాంచ్‌కి సహాయం చేయాలని కోరారు.

ప్రజల జీవితాల్లో సరికొత్త కాంతులు
- కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, అక్టోబర్ 30 ప్రభాతవార్త: దీపావళి పండుగతో జిల్లా ప్రజలందరీ జీవితాల్లో సరికొత్త కాంతులు నింపాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆకాంక్షించారు. దీపావళి పండుగ పురస్కరించుకుని బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లా ప్రజానీకానికి శుభాకాంక్షలు తెలిపారు ప్రతి ఒక్కరు ఆనందోత్సవాల మధ్య దీపావళి పండును జరుపుకోవాలని కలెక్టర్ కోరారు.

జిల్లా ప్రజలందరికీ దీపావళి పండుగ శుభాకాంక్షలు

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 30, ప్రభాతవార్త:
ప్రజలందరి జీవితాలలో ఈ దీపావళి పండుగ వెలుగులు నింపాలని, ప్రజలందరూ భక్తి శ్రద్ధలతో జాగ్రత్తలు పాటిస్తూ దీపావళి పండుగను జరుపుకోవాలని జిల్లా ఇన్చార్జి మంత్రి, రెవెన్యూ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, ఎస్పి ఎల్. సుబ్బరాయుడు, జేసి శుభం బన్సల్ తదితరులు దీపావళిపండుగ శుభాకాంక్షలు తెలిపారు.

కార్యకర్తలకు అండగా నిలిచేది తెదేపానే

– మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్

కుప్పం, అక్టోబర్ 30 ప్రభాతవార్త

కార్యకర్తలకు అండగా నిలిచేది తెలుగుదేశం పార్టీయే నని మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్ పేర్కొ న్నారు. బుధవారం 12వ వార్డులో తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ వంద రూపాయలతో సభ్యత్వం పొందే కార్యకర్తలకు 5లక్షల భీమా సౌక ర్యంను తెదేపా అధినేత, సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ కల్పిస్తున్నారన్నారు. అలాగే కార్యకర్తలు మృతి చెందితే అంత్యక్రియలకు పదివేల సాయం అందించడం జరుగుతుందన్నారు. మున్సిపల్ పరిధిలో అత్యధికంగా సభ్యత్వ నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, మాజీ సర్పంచ్ డికెపల్లి మణి, నేతలు రవి, ప్రకాష్, డివి భాస్కర్, ఇర్ఫాన్, నబీఉల్లా, గనిఉల్లా, మునెప్ప పాల్గొన్నారు.

పరమహంసలో ముగిసిన అటల్ టీచర్స్ వర్క్‌షాప్

శాంతిపురం, అక్టోబర్ 30 ప్రభాతవార్త

స్థానిక శ్రీ పరమహంస యోగానంద విద్యాలయలో మూడు రోజులుగా జరిగిన హబ్ అండ్ స్పోక్ అటల్ టీచర్స్ వర్క్‌షాప్ ముగిసింది. చివరి రోజు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, ఎపిఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్, కెఇసి హెచ్‌ఒడి డా॥ కోదండరామయ్య, విద్యాలయ ఛైర్మన్ గోపాల్ జీ అగర్వాల్, ప్రిన్సిపాల్ ఆజాద్ హుసేన్ తదితరులు హాజరయ్యారు. అటల్ ల్యాబ్‌తో కలిగే ప్రయోజనాలు, ల్యాబ్ ఏర్పాటులో దాగున్న ఆవిష్కరణ లగురించి వక్తలు వివరించారు. అనంతరం ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రమణ, స్టేట్ టాస్క్‌ఫోర్స్ మెంబర్ షాహినా ప్రవీణ్, భువనేశ్వరి, హేమ, రమేష్, అక్షత, నారాయణరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

రైలునుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

కుప్పంరూరల్, అక్టోబర్ 30 ప్రభాతవార్త

చెన్నై – బెంగళూరు రైలు మార్గంలో ఆంధ్ర –తమిళనాడు సరిహద్దుల్లో పచ్చూరు వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ నాగరాజు తెలిపారు. మృతుడు ఎరుపు రంగు చొక్కా ధరించి ఉన్నాడన్నారు. సంఘటనా స్థలిని పరిశీలించిన అనంతరం మృతదేహాన్ని పంచనామా నిమిత్తం కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడిని గుర్తించిన వారు కుప్పం రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకై ఓటర్ల జాబితా సిద్ధం

శాంతిపురం, అక్టోబర్ 30 ప్రభాతవార్త

సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి శాంతిపురంలో నాలుగు చెరువుల పరిధిలో ఓటర్ల జాబితాలు సిద్ధం చేసి ప్రకటించినట్లు తహశీల్దార్ శివయ్య పేర్కొన్నారు. రాళ్లబూదుగూరు పెద్ద చెరువు, ఎంకెపురం గిరివాసయ్య ఒడ్డు చెరువు, సోగడబళ్ల పెద్ద చెరువు, కొలమడుగు పెద్ద చెరువుకు సంబంధించి ఆయా పంచాయతీ, తహశీల్దార్ కార్యాలయంలో ప్రకటించామన్నారు. ఏదేని అభ్యంతరాలు ఉంటే నవంబర్ 2లోగా తమ దృష్టికి తీసుకురావాలని తహశీల్దార్ పేర్కొన్నారు. అభివృద్ధిలో భాగస్వాములు అవుతాం :

ఎమ్మెల్యేచే రూ. 60వేలు అందజేత

చౌడేపల్లి, అక్టోబర్ 30 ప్రభాతవార్త

మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌భాషాచే రైతుకు రూ. 60వేలనందించారు. మండలంలోని పెద్దకొండా మర్రి పంచాయతీ కోటూరుకు చెందిన హుసేన్‌సాబ్ పాడిఆవును ఆగస్టు18న అడవిలో చిరుత బలితీసు కొంది. ఫారెస్టు అధికారుల విచారణలో చిరుత దాడి లోనే ఆవు మృతి చెందినట్లు ధృవీకరించబడింది. దీంతో మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌భాషా బాధిత రైతుకు ప్రభుత్వం తరపున రూ. 60వేల చెక్కునం దించాడు. ఎఫ్ఆర్ఓ వేణుగోపాల్‌బాబు, డిఆర్వో మదన్‌మోహన్, ఎఫ్‌బిఓలు దీప, త్యాగరాజులు పాల్గొన్నారు.

ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన

శ్రీరంగరాజపురం, అక్టోబర్ 30 ప్రభాతవార్త: మండల పరిధిలోని అసైన్డ్ భూముల్లో గత ప్రభుత్వం ఫ్రీ హోల్డ్‌గా నమోదు చేయబడిన భూములను తహసిల్దారు లోకనాధపిళ్ళై బుధవారం పరిశీలించారు. కొత్తపల్లి గ్రామంలో ఫ్రీహోల్డ్ భూములుగా నమోదైన భూముల వద్దకు వెళ్ళి రికార్డుల మేరకు యాజమానుల పేర్లను తనిఖీ చేశారు. భూముల విస్తీర్ణం, సరిహద్దుల్లో వున్న రైతుల పేర్ల వివరాలను తహసిల్దారు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ సర్వేయర్, విఆర్ఓ, విఆర్ఎలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

టపాకాయల విక్రయాలకు అనుమతులు తప్పనిసరి

పాలసముద్రం, అక్టోబర్ 30 ప్రభాతవార్త:

దీపావళి పండుగ పురస్కరించుకుని టపాకాయలు విక్రయించే వ్యాపారులు తప్పనిసరిగా అనుమతులు తీసుకుని విక్రయించాలని కార్వేటినగరం సర్కిల్ ఇన్స్‌పెక్టర్ హనుమంతప్ప స్పష్టం చేశారు. ఎక్కడైనా అనుమతులు లేకుండా టపాకాయల విక్రయాలు చేపడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. దీపావళి పండుగ సందర్భంగా టపాకాయలు పేల్చడం అనవాయితీ అని టపాకాయలు విక్రయదారులు అనుమతించిన ప్రదేశాల్లో మాత్రమే విక్రయాలు చేపట్టాలని స్పష్టం చేశారు. అలాగే టపాకాయల విక్రయ లైసెన్సుదారులు తమ దుకాణాల వద్ద ప్రమాదాలు జరుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుని టపాకాయల విక్రయాలు చేపట్టాలన్నారు

భూముల రీ-సర్వేపై 21 అర్జీలు

పాలసముద్రం, అక్టోబర్ 30 ప్రభాతవార్త:

పాలసముద్రం మండలం బాలకృష్ణాపురం గ్రామంలో బుధ వారం నిర్వహించిన భూముల రీ-సర్వేకు సంబం ధించిన గ్రామసభలో రైతుల నుండి అధికారులకు 21 సమస్యలు అందాయి. మండల సర్వేయర్ గణేష్ ఆధ్వ ర్యంలో బాలకృష్ణాపురంలో భూముల రీ-సర్వే గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేయర్ గణేష్ మాట్లాడుతూ గ్రామాల్లో భూములకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం రీ-సర్వే చేసిన గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించాలని నిర్ణయించిందన్నారు. ఈ అవకాశంను సద్వినియోగం చేసుకుని ఎక్కడైనా భూముల రీ-సర్వేకు సంబంధించి సమస్యలు వుంటే రెవెన్యూ అధికారుల దృష్టికి గ్రామసభలో తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భూముల రీ-సర్వే సర్వేయర్ ప్రవీణ్‌కుమార్, సర్వేయర్ హరి, విఆర్ఓలు, గ్రామ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

తోటపల్లి రోడ్డు వెడల్పు చేయండి

పాకాల, అక్టోబర్ 30, ప్రభాతవార్త

పాకాల మండల కేంద్రం నుంచి తోటపల్లి మీదుగా చిత్తూరు తిరుపతి ఆరు లైన్ల రహదారికి కనెక్టివిటీ రోడ్డుగా ఉన్న పాకాల తోటపల్లి లింక్ రోడ్డు సరిపడు వెడల్పు లేకపోవడంతో ఇటుగా వెళ్లే ప్రయాణికులు నిత్యం తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కొన్నారు. చిత్తూరు, తిరుపతి రోడ్డులోని మార్గంలోని రైల్వే గేట్లు, రోడ్డు రిపేరైనప్పుడల్లా ప్రత్యామ్నాయ మార్గంగా ఉన్న ఈ లింక్ రోడ్డులో ప్రయాణం చాలా సాహసంగా మారింది. ఈ మార్గం గుండా ప్రయాణించే ప్రజలు, వాహనదారులు నిత్యం తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ రోడ్డుపై వెంటే స్పందించి రోడ్డు వెడల్పు చేసి ట్రాఫిక్ సమస్యలు తీర్చవల్సిందిగా ప్రజలు వాహనదారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కుప్పం ఆర్టీసీ డిపో మేనేజరుగా గోపీనాథ్ బాధ్యతలు

కుప్పం, అక్టోబర్ 30 ప్రభాతవార్త

ఎపిఎస్ ఆర్టీసీ కుప్ప ం డిపో నూతన మేనేజరుగా గోపీనాథ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన విజయవాడ సెంట్రల్ కార్యాలయం నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ డిఎంగా పనిచేస్తున్న పెంచలయ్య వాకాడు డిపోకు బదిలీ అయ్యారు. ఈస ందర్భంగా కొత్త,పాత మేనేజర్లను ఎన్ఎంయుఎ నేతలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘ నేతలు వేలు, మొగిలీశ్వరయ్య, ప్రసాద్, మునస్వామి, జయపాల్, మునెప్ప, నారాయణ, వెంకటేష్, రహంతుల్లా, దిలీప్, అరుణ్, సురేష్,నాయుడు, భాస్కర్, నాయక్, రాజా పాల్గొన్నారు.

కుప్పంలో దీపావళి పండగ సందడి

కుప్పం, అక్టోబర్ 31 ప్రభాతవార్త

కుప్పం పట్టణంలో బుధవారం దీపావళి పండగ సందడి కన్పించింది. దీపావళి పండగను పిల్లలు మొదలు పెద్దలు కూడా ఎంతో ఇష్టంగా జరుపుకుంటారు. ఈ నేపథ్యంలో పండగ కొనుగోళ్లకు గ్రామీణ ప్రాంతాలనుంచి వచ్చిన జనంతో పట్టణం కిటకిటలాడింది. నేతాజీ రోడ్, బైపాస్ రోడ్డులో గల వస్త్ర, చిల్లర దుకాణాలు, టపాకాయల దుకాణాల వద్ద సందడి కన్పించింది. ప్రజలు పెద్ద ఎత్తున టపాకాయల కొనుగోళ్లు చేస్తూ కన్పించారు. గురు, శుక్రవారాల్లో ప ండగ జరుపుకోనున్నారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

పంటసాగుపై అవగాహనతో అధిక లాభాలు

జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

వెదురుకుప్పం,అక్టోబర్ 30 ప్రభాతవార్త : రైతులు సీజన్‌కు తగినట్లు పంటల సాగుపై అవగాహనతో సాగుచేయడంతో అధిక లాభాలు పొంది, వ్యయం తగ్గించుకోవచ్చని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ సూచించారు. మండలంలోని తార్లబయలు రెవెన్యూ పరిధిలోగల చవనపల్లెలో పొలంబడి కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం పార్టీ జిల్లా మాజీ కార్యదర్శి మోహన్ మురళి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు మరియు క్షేత్ర పరిశీలన నిర్వహించారు. జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా తీసుకుని వారంలో ప్రతి మంగళ, బుధవారాల్లో వ్యవసాయ అనుబంధశాఖల అధికారులు పొలం బాట పట్టి రైతులకు ఆధునిక సాంకేతిక పద్ధతులతో పంటలు సాగుచేసి తక్కువ ఖర్చుతో అధికదిగుబడి పొందడం మెలకువలను వివరించాలన్నదే లక్ష్యం అన్నారు. వ్యవసాయంలో నూతన విధానాలు అవలంభించి వ్యవసాయంను లాభాలబాట పట్టించాలని సూచించారు. సిరికల్చర్ అధికారి రమేష్ రెడ్డి, పశువైద్యాధికారి రాజేష్, సింగి ల్ విండో సీఇవో రమేష్, వ్యవసాయాధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

యువతరంగ్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

వెదురుకుప్పం, అక్టోబర్ 30 ప్రభాతవార్త : విశ్వవిద్యా

లయం విద్యార్థులలో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీయడం కొరకు యువతరంగ్ ఉత్సవాలను నిర్వహిస్తుందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం కల్చరల్ సమన్వయకర్త డాక్టర్ వివేక్ అన్నారు. మండల కేంద్రంలోని వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం యూత్‌ఫెస్టివల్ అవగాహన సదస్సును కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నపూర్ణ శారద అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతరంగ్ కార్యక్రమాన్ని నవంబర్ 8 నుంచి 10 వరకు విశ్వవిద్యాల యం నిర్వహిస్తుందన్నారు. వివిధ విభాగాలలో పోటిపడే విద్యార్థిని, విద్యార్థులకు తమ ప్రతిభను ప్రదర్శించడంకు యువతరంగ్ చక్కటి వేధిక అన్నారు. మ్యూజిక్, డ్యాన్స్, లిటరరీ ఈవెంట్సె. ధియేటర్ ఈవెంట్స్, ఫైన్ ఆర్ట్స్‌గా విభజించి పోటీలు నిర్వహించడం జరుగుతుందని ఆశక్తిగల విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించాలని చెప్పారు. వైస్ ప్రిన్సిపాల్ ప్రసన్న లత, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త మంగళగౌరీ, కల్చరల్ సమన్వయకర్త భీమ మోహన్‌రావు, అధ్యాపకులు ప్రభాకర్‌రావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

పలమనేరు,అక్టోబర్ 30,ప్రభాతవార్త:

పలమనేరు టపాకాయల దుకాణ దారులు నిబంధ నలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని సిఐ నరసింహ రాజు హెచ్చరించారు. పట్టణంలో ఏర్పాటు చేసిన టపా కాయల దుకాణాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. నిబంధనలను పాటిస్తు దుకాణాలను నిర్వహించుకోవాలని అత్యవసర అగ్నినియంత్రణ వస్తువులు,నీరు దుకాణాల వద్ద ఏర్పాటు చేయాలని, దుకాణాల సమీపంలో టపాయాలను పేల్చకుండా నిర్వహకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ స్వర్ణతేజ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ మండల అధ్యక్షుడిగా రాజేష్‌కుమార్

తవణంపల్లి, అక్టోబర్ 30 ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(ఎపియుటిఎఫ్) తవణంపల్లి మండల శాఖ నూతన అధ్యక్షుడుగా ఎస్.రాజేష్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. యుటిఎఫ్ ఏర్పాటై 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఐరాల క్రాస్ మండల ప్రాథమిక పాఠశాలలో బుధవారం మండల కౌన్సిల్ సమావేశం జరిగింది. సంఘ జిల్లా అధ్యక్షులు ఎన్.సోమశేఖర్ నాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల నూతన కార్యవర్గంను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఎస్.రాజేష్‌కుమార్, సహఅధ్యక్షులుగా వై.శేఖరయ్య, బి.మమత, ప్రధాన కార్యదర్శిగా పి.పెద్దబ్బరెడ్డి, కోశాధికారిగా చిరంజీవి, కార్యదర్శులుగా ఎస్.నిరంజన్‌రెడ్డి, ఎం.అరుణాచలం, ఎస్.గీతలు ఎన్నికయ్యారు. అలాగే ఆడిట్ కమిటీ కన్వీనర్ పి.వెంకటరమణ, జిల్లా కౌన్సిలర్‌గా ఎస్.రాజేష్‌కుమార్, పి.పెద్దబ్బరెడ్డి, జి.సురేష్‌బాబు, పి.శైలజలు ఎన్నిక కాగా మండల గౌరవ అధ్యక్షులుగా ఎన్.మునస్వామిలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సోమశేఖర్‌నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం జిఓనెం.117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యుటిఎఫ్ నాయకులు, సిఐటియు నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

ఉపాధిహామీ పనులపై అధికారులను నిలదీసిన ప్రజాప్రతినిధులు

కోట,అక్టోబర్ 30 ప్రభాతవార్త

కోత్తపట్నం గ్రామ పంచాయతీలోని ఉపాధిహామీ పథకంలో భాగంగా కూలీలకు పనులు చూప డటం లేదంటూ ఆగ్రామ సర్పంచ్, తిరుపాల య్య, ఉప సర్పంచ్ ,మాజీ జెడ్పిటిసీ సభ్యులు ఉప్పల ప్రసాద్ గౌడ్ మరియు ఆయా గ్రామ కూలీలలు కలిసి అధికారులను నిలదీశారు. బుధవారం కోత్తపట్నం గ్రామానికి చెందిన 100 మంది కూలీలు ఒక్క సారిగా స్థానిక ఎంపిడివో కార్యాలయాంలోకి వచ్చి తమదైన శైలీలో అధికారులు తీరుపై మండి పడ్డారు. గత 18 సంవత్సరాలగా ఉపాధీహామీ పథకం కింది పేద కూలీలు పనులు చేసుకొంటూ జీవనం సాగిస్తున్నారని ఎంపిడివో వేణు ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ఎపివో కక్షపూరితంగా తమ పై వ్యవహరిస్తుందని ఈ సందర్భంగా ప్రసాద్ గౌడ్ సర్పంచ్ తిరుపాలయ్య ఆరోపించారు. నీరు చెట్టు కింది సోనా కాలువ మరమ్మతులు చేసేందుకు తెలుగు తమ్ముళ్లుకు ఆపనులు ఇవ్వాలని అధికారులు చూస్తున్నారని వారు విమర్శించారు. ఈక్రమంలో తమపై ప్రసాద్ గౌడ్ దురుసుగా వ్యహరించారని పోలీస్ స్టేషన్‌లో ఎపిఒ పూర్ణిమ్మ పిర్యాదు చేసింది. ప్రసాద్ గౌడ్ విలేకర్లతో మాట్లాడుతూ పేద కూలీల చసిన పనులకు గాను 1.58 లక్షలను మస్టర్లు నుంచి ఏలా తోలగించారని అడిగినందుకు తమ పై కేసు పెట్టారని ఆయన ఆరోపించారు. పేద కూలీల కడపు కొట్టదని ఆయన కోరారు. ఈ లాంటి తాటికు చప్పుళ్లుకు భయపడదిలేదన్నారు. అధికారులు పేద కూలీలు కడుపు కోట్టితే అడగటం నేరమా అని ఆయన ప్రశ్నించారు.. తమ పై అన్యాయంగా కేసు పెడితే ప్రతి అధికారిని న్యాయ స్థానంలో నిలబెడుతామన్నారు. ఎపివో వైఖరిపై జిల్లా కలెక్టర్ కు పిర్యాదు చేస్తామన్నారు.

మేత పొరంబోకు భూమిని అమ్మేశారని తహశీల్దార్‌కు ఫిర్యాదు

బాలాయపల్లి, అక్టోబర్ 30, ప్రభాతవార్త

మన్నూరు బీసీ కాలనీకి చెందిన మేత పొరంబోకు భూమిని చెన్నూరు గ్రామానికి చెందిన కట్ట రమణ య్యకు కొందరు విక్రయించారని తహశీల్దార్ పి. శ్రీనివా సులకు బీసీ కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. చెన్నూరు గ్రామానికి చెందిన రమణయ్య భూమిని జేసిబి పెట్టి చదును చేస్తుండగా బీసీ కాలనీకి చెందిన కోటేశ్వర రావు తదితరులు అడ్డుకొని తహశీల్దార్ ఫిర్యాదు చేశారు. ఈ భూమి అన్యాక్రాంతం అయితే పశువులకు మేత లేకుండా పోతుందని వారు తహశీల్దార్‌కు తెలిపారు. విచారించి న్యాయం చేస్తానని తహశీల్దార్ వారికి తెలిపారు.

సబ్ ఇంజనీర్ ఆరోపణలు అవాస్తవం

మాజీ ఏఎంసి చైర్మన్ రాజేశ్వర రావు

వెంకటగిరి, అక్టోబర్ 30, ప్రభాతవార్త

భూ సమస్య విషయంలో విద్యుత్ శాఖ సబ్ ఇంజనీర్ శ్రీహరి తనను బెదిరించారని చేసిన ఆరోపణలు అవాస్తమని మాజీ ఏఎంసి చైర్మన్ పులికొల్లు రాజేశ్వర రావు, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్ తెలిపారు. సబ్ ఇంజనీర్ శ్రీహరికి సంబంధించిన స్థలంలో ఉన్న సమాధులను ధ్వంసం చేసిన విషయంలో ఎమ్మెల్యే దగ్గరికి వచ్చి న్యాయం చేయాలని కోరినప్పుడు తాము అక్కడే ఉన్నామని ఎమ్మెల్యే పోలీసులకు ఫిర్యాదు చేయమని చెప్పారని తెలిపారు. పోలీసులు కూడా కేసు నమోదు చేశారని చెప్పారు. తాము బెదిరించినట్లు సబ్ ఇంజనీర్ చేసిన ఆరోపణలు అవాస్తమని తెలిపారు. ఆయన తమపై బుడదచల్లేందుకు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో పద్మశాలి సంఘం నాయకులు శ్రీనివాసులు, నరసింహులు, చెంచయ్య, లక్ష్మిపతి తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు ఎరువులు విత్తనాలు అమ్మితే చర్యలు

వెంకటగిరి, అక్టోబర్ 30, ప్రభాతవార్త అధిక ధరలకు ఎరువులు విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఏడిఏ ఎం. నాగార్జున సాగర్ సుజాత హెచ్చరించారు. వెంకటగిరి పట్టణంలోని ఎరువులు విత్తనాల దుకాణాలను వారు తనిఖీ చేశారు. ఎన్ఎల్ఆర్ 15048, 2345, కేఎల్ఎం 1638, 442 రకాల వరి విత్తనాలు డీలర్ల వద్ద ఉన్నాయని తెలిపారు. 1996 సీడ్ ఆక్ట్ ప్రకారం ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు విక్రయించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నవంబర్ నెల 15వ తేది లోపల రైతులు వరినారుమడి సాగు చేయాలని సూచించారు. ఎరువులు విత్తనాల కొరత లేదని తెలిపారు.

వెంకటగిరి అభివృద్ధికి నిధులు ఇవ్వాలి

అభివృద్ధి కమిటీ సమావేశంలో చైర్ పర్సన్ నక్క భానుప్రియ విజ్ఞప్తి

వెంకటగిరి, అక్టోబర్ 30, ప్రభాతవార్త

వెంకటగిరి పట్టణ అభివృద్ధికి నిధులు ఇవ్వాలని చైర్ పర్సన్ నక్క భానుప్రియ జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశాల్లో కోరారు. తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ తిరుపతి పార్లమెంటు సభ్యులు సభ అధ్యక్షులు చైర్మన్ గురుమూర్తి, చిత్తూరు పార్లమెంట్ సభ్యులు ప్రసాద రావు నేడు తిరుపతి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వేదికగా జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశంలో వెంకటగిరి మున్సిపల్ చైర్ పర్సన్ నక్కా భానుప్రియ పాల్గొన్నారు. వెంకటగిరి మున్సిపాలిటీ అభివృద్ధి కొరకు నిధులు ఇవ్వాలని కోరారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్, వెంకటగిరి నుండి బాలాయపల్లి రహదారి మార్గం, జిజి ఎంపి పేవమెంట్, పలు అంశాలపై తిరుపతి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సమావేశానికి ఎంపిపి తంబిరెడ్డి తంజారెడ్డి, మాజీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా వెంకటేశ్వర రావు, పూజారి లక్ష్మి పాల్గొన్నారు.

రీ సర్వే గ్రామసభలో అర్జీలు

వాకాడు, అక్టోబర్ 30, ప్రభాతవార్త

వాకాడు మండలంలోని కొండూరు పంచాయితీ పరిధిలో గూండ్లు గ్రామంలో రీసర్వే గ్రామ సభ బుధవారం డిప్యూటీ తహశీల్దార్ సందీప్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సభలో రైతులు పాల్గొని రీ సర్వే జరిగినప్పటి నుండి భూ సమస్యల మీద రెండు అర్జీలు రైతులు రీ సర్వే గ్రామ సభలో డిప్యూటీ తహశీల్దార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ సందీప్ కుమార్ మాట్లాడుతూ రీసర్వే జరిగిన గ్రామ సభలో వచ్చేటువంటి అర్జీలను స్వీకరించడం జరిగిందని, ఎల్పిఎం నెంబర్ 62 గ్రామసభలో ఆర్ఓఆర్‌కు 73.75 ఎకరాలకు సంబంధించి చదివి వినిపించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ అఖిల్ యాదవ్, వీఆర్ఓ చిరంజీవి, భాస్కర్, రెవెన్యూ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

మొనపాలెంలో పొలం పిలుస్తుంది

వాకాడు, అక్టోబర్ 30, ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన పొలం పిలుస్తుంది కార్యక్రమంను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వాకాడు వ్యవసాయ శాఖ అధికారిని దీప తెలిపారు. బుధవారం మండలం లోని మొనపాలెం, నలగమాల పంచాయితీలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తన శుద్ధి వలన కలుగు ప్రయోజనాలు, సీజన్‌లో నారుమడి, బీజామృతంతో విత్తన శుద్ధి, ఎరువుల వలన కలుగు ప్రయోజ నాలుతో పాటు వివరించారు. పశువులు, గొర్రెలు, మేకలు సీజనల్ వ్యాధులు నివారణ, మత్స్యకార పథకాలు, రాయితీలు గురించి పశుసంవర్ధక శాఖ సిబ్బంది రమేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మొనపాలెం ఉప సర్పంచి వెంకటరత్నం, నాయకులు, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

వంజివాలో పొలం పిలుస్తోంది

కోట, అక్టోబర్ 30 ప్రభాతవార్త

కోట మండలం కొక్కుపాడు, వంజి వాక గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసా యాధికారి నిరంజన్‌కుమార్ ఆధ్వర్యం లో నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి నిరంజన్‌కుమార్ మాట్లాడుతూ ఒక ఎకరా పోలంకి 5ఎంట్లు నారుముడి ఏర్పాటు చేసుకొని 2 కేజీలు నత్రజిని (విత్తనం చల్లేముందు 1కేజీని విత్తనం, మరో 15 రోజుల ముందు 1కేజీ భాస్వరం 1కేజీ పొటాష్ ఎరువులు దుక్కిలో వేయాలన్నారు. అధిక దిగుబడులు పొందే పంటలు సాగు చేయాలని సూచించారు. భూసార పరీక్షలు చేయించుకోవాలని కోరారు. వరిపైరుకు తెగులు సోకినప్పుడు వ్యవసాయాధికారుల సూచనల మేరకు రైతులు మందులు వాడాలని కోరారు. ప్రభుత్వం రైతులకు ఎన్నో సబ్సిడీ పథకాలు ప్రవేశపెడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయానుబంధ శాఖల దికారులు ధికారులు పాల్గొన్నారు.

మోటార్లు చోరీలను ఆరికట్టండి

కోట,అక్టోబర్ 30 ప్రభాతవార్త

కోట మండలంలోని అల్లంపాడు, సిద్ధవరం,తదితర గ్రామాలల్లో రైతులు పోల్లాల్లో మోటార్లు, స్టాటర్లు, విద్యుత్ వైర్లు, స్థంబాలు సైతం దొంగలు తీసేళ్లా తున్నారని రాష్ట్ర భాజపా కార్యవర్గ సభ్యులు పనబాక కోటీశ్వర

ప్రేమ విఫలమా? పని వత్తిడా?

వలస కార్మికుడు ఆత్మహత్య

శ్రీకాళహస్తి అక్టోబర్ 30 ప్రభాతవార్త

శ్రీకాళహస్తికి సమీపంలోని పుష్పిత్ స్టీల్స్‌లో పని చేస్తున్న వలస కార్మీకుడు రాహుల్ (23)ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే ఆతని మృతికి కారణం కొందరు ప్రేమవిఫలమని, మరి కొందరు పని వత్తిడి అని చెబుతున్నారు. కార్మికుడు తన గదిలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిసింది. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం రామ్‌పూర్ జిల్లా జీవైకే కరీం గ్రామానికి చెందిన రాహుల్ ఈనెల 5న ఒప్పంద కార్మికుడుగా చేరాడు. శ్రీకాళహస్తి రూరల్ మండలం కోళ్ళ పారం వద్ద తన సొదరుడుతో కలసి ఉంటున్నాడు. బుధవారం మధ్యాహ్నం గదిలో ఎవ్వరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇది గమనించి తొటి కార్మికులు రాహుల్‌ను హుటాహుటిన తిరుపతికి వైద్య చికిత్స కోసం తీసుకెళ్ళారు. తిరుపతి రుయాకు తరలించగా అక్కడ వైద్యపరీక్షలు చేసిన డాక్టర్లు అప్పటికేమృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆతని ఆత్మహ్యతపై భిన్నాభిప్రాయాలు వినబడుతున్నాయి. మృతుని సొదరుడు పని వత్తిడి భరించలేకే ఆత్మహత్యకు పాల్పడ్డాడని రూరల్‌పోలీసులకు ఫిర్యాదు చేసారు. మృతుని కుటుంబానికి రూ.20లక్షలు కంపెనీ నష్టపరిహారం చెల్లించాలని మృతదేహం సకాలంలో స్వగ్రామానికి చేర్చటానికి పరిశ్రమ మేనేజ్‌మెంట్ ఏర్పాట్లు చేయాలని సిఐటియూజిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య డిమాండ్ చేసారు.

ఆరోగ్యకరమైన నారుతోనే అధిక దిగుబడులు

రైతులకు శిక్షణ

శ్రీకాళహస్తి రూరల్, అక్టోబర్ 30 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలంలోని రైతులు వ్యవసాయపనుల్లో అధునిక సంప్రదాయ పద్ధతులను అనుసరించాలని బుధవారం జరిగిన రైతు చైతన్య సదస్సుల్లో వ్యవసాయాధికారులు రైతులకు సూచనలు చేసారు. శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామంలో ఏర్పాటు చేసిన సదస్సుకు వ్యవసాయ వనరుల కేంద్రం శిక్షణ కేంద్రం కో ఆర్డినేటర్ భాస్కరయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన సూచనలు చేస్తూ నారుమడి విరివిగా సేంద్రీయ ఎరువులు వేసి 30కిలోల విత్తనాల విత్తనాలను ఐదు సెంట్ల నారు పోయాలని సూచించారు. దీని వల్ల నారుగట్టి పొలంలో పిలకలు అధికంగా వస్తాయన్నారు. నారుపీకే వారం ముందు 5ంసెంట్లలోనారుకు కిలో కార్పొఫిరాన్ గుళికలు వేసి నీరు పెట్టి ఇంకించాలన్నారు. దీంతో నారు పొలంలో నాటిన తరువాత 3వారాల వరకు పైరుకు చీడలు రావని తెలిపారు. జిల్లా వనరుల కేంద్రం ఏఓ వేణుగోపాలరావు మాట్లాడుతూ రబీ కాలానికి ఎంటియు 1271బిపిటి 3082,ఎన్ఎల్ఆర్ 34449,కేయన్ఎం 733 అనువైనవని వివరించారు. ఆర్ఎన్ఆర్ 15048 రకాన్ని నవంబర్ 15పైన నారుపోసి డిసెంబర్ 15లోగా నాటుకోవాలని కోరారు. ఈ కాలంలో నాట్లు వేస్తే ఈ రకం మంచి ఫలితాలను ఇస్తాయని వివరించారు. ఏడీఏ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ వరిలో యూరియాని పొదుపుగా వాడాలని లేకుంటే చీడల బెడద ఎక్కువ అవుతుందన్నారు. రబీ కాలానికి అవసరమైన ఎరువులను రైతే సేవా కేంద్రంలో అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఈ సదుపాయాల్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో రైతులతో పాటు గ్రామ వ్యవసాయ సహాయకులు బాలునాయక్ పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికే గ్రామసభలు

తొట్టంబేడు, అక్టోబర్ 30 ప్రభాతవార్త

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలను నిర్వహిస్తున్నామని వీటిని గ్రామరెవెన్యూలో ఉన్న ప్రజలందరు సద్వినియోగం చేసుకో వాలని తహశీల్దార్ యు.మధుసూధ నరావు, డిఐ రాఘవయ్య, సర్వేయర్ కె.హరనాథ్‌లు పిలుపునిచ్చారు. గ్రామసభల్లో భాగంగా రీ సర్వేలో ప్రజల నుంచి పలు వినతులు వచ్చాయి. వాటిని వెంటనే పరిష్కరించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తహశీల్దార్ తెలిపారు. భూయాజమాన్య హక్కులు అన్నదాతలకు వారి భూములు ఎక్కడ వరకు ఉన్నాయో సమగ్రంగా తెలుసుకోవడానికే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శివనాథపాళెంగ్రామంలో గ్రామసభను నిర్వహించివచ్చిన వినతులు సకాలంలో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో విఆర్ఓ రాఘవులు,గ్రామ సర్వేయర్లు, మరియు విజయ్‌లోకేష్, సుకన్య, అంజలి, మహేష్, సుబ్రమణ్యం సత్యనారాయణ, కమ్యూనిటీ సర్వేయర్‌లు సత్యనారాయణ, రైతులు మరియు గ్రామ ప్రజలు హాజరయ్యారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు రొంపిచర్ల విద్యార్థినులు ఎంపిక

రొంపిచెర్ల, అక్టోబర్ 30, ప్రభాతవార్త

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు రొంపిచెర్ల బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు నవ్య శ్రీ, మేఘన ఎంపిక అయినట్లు ప్రధానోపాధ్యాయులు లక్ష్మీదేవి తెలిపారు. స్కూల్ గ్రేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. తిరుపతి జిల్లా పొంగూరు హైస్కూల్‌లో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో వీరు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలియజేశారు. స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. అండర్ 17 పోటీలకు నవ్యశ్రీ, అండర్ 14 పోటీలకు మేన ఎంపిక అయ్యారని తెలిపారు. ఎంపికైన వారిని పిఈటి శ్రీవాణి, టీచర్లు అభినందించారు.

మామిడి పూత దశలో తీసుకోవాలల్సిన జాగ్రత్తలపై రైతులకు శిక్షణ

రొంపిచెర్ల, అక్టోబర్ 30, ప్రభాతవార్త

మామిడి పూత దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్ రెడ్డి శాస్త్రవేత్త పీరు సాహెబ్ అవగాహన కల్పించారు. రొంపిచెర్ల ఎంపిడిఓ కార్యాలయంలో జరిగిన మామిడి రైతల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పూత నిలబడడానికి అర్క మాంగో స్పెషల్ అనేది ఐఐహెచ్ఆర్ బెంగళూరు వారిచే కొత్తగా కనుగొనబడిన పోషకంని ఒక లీటర్ నీటిలో 8 గ్రాములు కలిపి పిచికారి చేయాలన్నారు. పూత మొదలవడానికి ముందు 130.45 మల్టీ కె8 గ్రాములు బోరాన్ 2 గ్రాములు ఒక లీటరు నీటితో కలిపి పిచికారి చేయాలన్నారు. వాటి ద్వారా పూత బాగా తయారు అవుతుందన్నారు. పురుగు మందులు పిచికారి చేసినప్పుడు మొక్క యొక్క కాండం నఉంచి చిగురు వరకు తడిసేలా పిచికారి చేయవలెను అన్నారు. పురుగు మందులను వాడేటప్పుడు ఒకే రకం మందులు మరలా మరలా మార్చుకుంటూ పిచికారి చేయవలెనని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన అధికారిని సంతోషి కుమారి, రైతులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధిలో భాగస్వాములవుతా ం: జడ్పీటీసీ నడింపల్లి

చౌడేపల్లి, అక్టోబర్ 30 ప్రభాతవార్త

మండలాభివృద్ధిలో భాగస్వాము లవుతామని ఎంపిపి గాజుల రామ్మూర్తి, జడ్పీటీసీ నడింపల్లి దామోధర్‌రాజు, ఉపాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డిలన్నారు. బుధవారం స్థానిక మండల పరిపాలనా భవనంలో సర్వసభ్య సమావేశం జరిగింది. గత ప్రభుత్వ హయాంలో మండలం టాప్5లో వుండేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అభివృద్ధి ఫలాలను ప్రజలకందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు సంబంధిత ప్రజా ప్రతినిధులతో మమేకమై ప్రజాభివృద్ధి, సామాజిక సమస్యలు పరిష్కరిద్దామన్నారు. మండల సర్వతోముఖాభివృద్ధికి సర్పంచలు, ఎంపిటీసీ సభ్యులకు అధికారులు సహకరించాలన్నారు. మండల సర్వసభ్య సమావేశానికి ఫారెస్టు, ఆర్టీసీ, ఎక్సైజ్ అధికారులు గైర్హజరయ్యారు. దీంతో ఎంపిడిఓ లీలామాధవి వారికి మెమోలు ఇస్తామన్నారు. అనంతరం ఆయా శాఖలకు చెందిన అధికారులు తమ పనితీరును సభలో వివరించారు. మండల ఉపాధ్యక్షుడు నరసింహులుయాదవ్, తహశీల్దార్ హనుమంత్‌నాయక్, సర్పంచలు సంఘ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మండలంలోని అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటీసీ సభ్యులు, పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎస్టీల ప్రత్యేక పౌరహక్కులపై సదస్సు

దొరవారిసత్రం, అక్టోబర్ 30, ప్రభాతవార్త

దొరవారిసత్రం మండలం పూలతోట ఎస్టీ కాలనీలో బుధవారం ఎస్టీ పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దొరవారిసత్రం మండల తహశీల్దార్ శైల కుమారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దొరవారిసత్రం మండల పరిధిలో ప్రతి నెల ఒక గ్రామాన్ని ఎంచుకుని ఎస్టీ ప్రజల పౌర హక్కుల పై అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం వారు ఎస్టీ ప్రజలకు కల్పించే రక్షణ చట్టాలు, విద్యా, ఆరోగ్య, సదుపాయాలలో వారికి రావాల్సిన రాయితీలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పూలతోట పంచాయితీ టిడిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సింగనాలటూరు గ్రామంలో పొలం పిలుస్తుంది

దొరవారిసత్రం, అక్టోబర్ 30, ప్రభాతవార్త

దొరవారిసత్రం మండలంలోని సింగనాలటూరు, కటువాపల్లి గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ అనిత మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం వారు అందించే అధునాతన వ్యవసాయ పరికరం వాడి వ్యవసాయ ఖర్చులను తగ్గించుకుని వ్యవసాయాన్ని లాభసాటి చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా సింగనాలటూరు గ్రామంలో రైతులు వేసిన పైరు పొలాలను పరిశీలించి వరిపొలంలో ఉల్లికోడి, తెల్ల తెగలు ఎక్కువగా ఉందని తెలియజేశారు. దాన్ని నివారించేందుకు పట్టర గుళికలు వేయాలని రైతులకు సూచించారు.

1న బొక్కసం పాళెం ఆలయంలో కేదారగౌరీ వ్రతం

శ్రీకాళహస్తిరూరల్,అక్టోబర్ 30 ప్రభాతవార్త

శ్రీకాళహస్తికి సుమారు పది కిలో మీటర్ల దూరంలోని మండలంలోని బొక్కసం పాళెంలో వెలసిన పురావస్తుశాఖ పరిధిలోని దేవాలయం (నేడు శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధం) శ్రీకామాక్షిమ్మ సమేత కోదండరామేశ్వరాలయంలో నవంబర్ 1న కేదార గౌరీ వ్రతాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వివరించారు. శుక్రవారం ఉదయం 8గంటలకు ఆలయంలోసామూహిక కేదార గౌరీ వ్రతాన్ని చుట్టుపక్కల గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలపు నిచ్చారు.

రాహుకేతుదోష నివారణ పూజలకు వస్త్రధారణను పున: పరిశీలించండి: బిజెపి

శ్రీకాళహస్తి,అక్టోబర్ 30 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజలకు సంబంధించి దేవస్థానం విధించిన సంప్రదాయ వస్త్రధారణకు సంబంధించి పునఃపరిశీలించాలని బిజెపి పట్టణ అధ్యక్షుడు గరికపాటి రమేష్‌బాబు ఇఓకు విన్నవించారు. ఈ పూజలకు బాధితులు నిరుపేదలు కూడా వస్తుంటారు. వారు రూ.500ల టిక్కెట్టు కొని పూజలు జరిపించుకోవాలని వస్తారు. అలాంటి వారు సంప్రదాయ వస్త్రధారణ అంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కోరారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు సంప్రదాయ దుస్తులు ధరించకుంటే అనుమతించేది లేదని సిబ్బంది అడ్డుకుంటున్నారని దానివల్ల ఆలయానికి చెడ్డపేరు వచ్చే ప్రమాదం ఉందని ఈ పూజల ప్రాధాన్యత సన్నగిల్లుతుందన్నారు. ఆలయానికి వచ్చే ప్రధాన ఆదాయ మార్గం ఇదే అనేది జగమెరిగిన సత్యం కాబట్టి తగినంత విస్తృత ప్రచారం తరువాత అమలు చేస్తే బాగుంటుందని తన అభిప్రాయంగా ఇఓకు వివరించారు.

డిసెంబర్ 8న ఏడుగంగమ్మల జాతర

శ్రీకాళహస్తి,అక్టోబర్ 30 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పట్టణంలో చలికాలంలో నిర్వహించే ఏడు గంగమ్మల జాతరను ఈ ఏడాది డిసెంబర్ 8 నుంచి నిర్వహించుటకు నిర్ణయించారు. ఈ మేరకు ఏడుగంగమ్మలు నిలుచు స్థలం వద్ద అమ్మవారి ఆలయ నిర్మాణాన్ని వేగవంతం చేసారు. డిసెంబర్ 8 ఆదివారం చాటింపు, 10న శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి అమ్మవార్లకు సారె అందించటం అర్ధరాత్రి దాటిన తరువాత ఏడుగంగమ్మలు గ్రామోత్సవం 11న జాతర అదే రోజు రాత్రి అమ్మవార్ల నిమజ్జనం జరుపుటకు ఏడుగంగమ్మల కమిటి నిర్ణయించి ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం:

తొట్టంబేడు,అక్టోబర్ 30 ప్రభాతవార్త

ఇటీవల రోడ్డు ప్రమాదంలో చనిపోయిన తొట్టంబేడు మండలం బసవయ్యపాళెంకు చెందిన ఫారెస్టు వాచర్ వెంకటేశ్ కుటుంబానికి బుధవారం శ్రీకాళహస్తి డివైయస్‌పి నరసింహామూర్తి సారధ్యంలో ఆర్థిక సహాయం అందించారు. వివరాలు ఇలా ఉన్నాయి. వారం క్రితం ఓ ప్రమాదానికి సంబంధించి పరిశీలనకు బయలు దేరిన పోలీసులు సమాచారం కోసం ఫారెస్టు చెక్ పోస్టు వద్ద ఉన్న వాచర్ వెంకటేష్‌ను వివరాలుఅ డిగారు. వెంకటేష్ తాను చూపిస్తామంటూ పోలీసులతో బయలు దేరారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సంఘటనను పరిశీలించటానికి వెళ్ళగా వెంకటేష్ పోలీసు వ్యాన్‌లోనే కూర్చొన్నాడు. అప్పుడే ఈ మార్గం గుండా వచ్చిన ఓ గ్యాస్‌లోడ్ వ్యాన్ అదుపు తప్పి పోలీసు వ్యాన్‌ను గుద్దుకోవటం అందులో కూర్చొన్న వెంకటేష్ ఆకాల మృత్యువు పాలయ్యాడు. ఈ సంఘటనకు సంబంధించి గ్యాస్ లారీ యజమాని చేత రూ.50వేలు మృతుని భార్య పద్మకు అందజేసారు. శ్రీకాళహస్తిలోని డివైయస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చెక్కును డివైయస్‌పి నరసింహారావు అందించారు. ఈ కార్యక్రమాల్లో డివైయస్‌పితో పాటు డెప్యూటీ రెంజర్ రామకృష్ణ సిఐలు వన్‌టౌన్ సిఐ డి.గోపి, రూరల్ సిఐ రవి నాయక్, టూటౌన్ సిఐ వెంకటేశులు, తిమ్మయ్యలు పాల్గొన్నారు.

కుస్తీ పోటీల్లో ఛాంపియన్‌షిప్ కైవసం

తిరుపతి విద్య,అక్టోబర్ 30,ప్రభాతవార్త:

విజయవాడలో అక్టోబర్ 2 నుంచి 5 వరకు జరిగిన ఆంధ్రప్రదేశ్ 68వ అండర్ 19 అంతర్ జిల్లాల బాలుర మరియు బాలికల కుస్తీ ఛాంపియన్‌షిప్ 2024-25 పోటీల్లో శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినిలు విజేతలుగా నిలిచి ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ని కైవసం చేసుకున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.భువనేశ్వరి వెల్లడించారు. ప్రాచీన కాలం నుండి భారతదేశంలో మల్ల యుద్ధంగా ప్రసిద్ధి చెందినదని భారతీయ ఇతిహాసమైన రామాయణంలో కూడా మల్ల యుద్ధ ప్రస్తావన కనిపిస్తుంది ఇది ముఖ్యంగా శారీరకంగా దృఢంగా ఉండడానికి ఒక చక్కటి వ్యాయామం అని ఇదే స్ఫూర్తి ఉత్సాహంతో మన వారసత్వాన్ని కొనసాగించాలని మరిన్ని క్రీడల్లో రాణించాలని ఆకాంక్షిస్తూ వీరికి శిక్షణ ఇచ్చిన కోచ్ సాయిసమితిని అభినందించారు. గెలుపొందిన విద్యార్థినిల్లో కె.రెడ్డి జీవన గోల్డ్,ఇ.సౌమ్య గోల్డ్,ఆర్.లక్ష్మీ లావణ్య గోల్డ్,కె.సింధు సిల్వర్,డి.నేహశ్రీ బ్రాంజ్,ఎమ్.నీలవేణి బ్రాంజ్,ఎమ్.నిత్య శ్రీ

ఘనంగా వల్లభాయ్ పటేల్ జయంతి

పుత్తూరు, అక్టోబరు 30 ప్రభాతవార్త :

స్వాతంత్ర్యానంతరం భారతదేశాన్ని ఏకం చేయడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి భారతీయులు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రమౌళి అన్నారు. అక్టోబరు 31వ తేదీన స్వతంత్ర భారత మొదటి ఉప ప్రధాని వల్లభాయ్ పటేల్ జయంతి రోజును జాతీయ ఐక్యతా దినోత్సవంగా జరుపుకుంటారని తెలిపారు. బుధవారం కాలేజీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతదేశం విచ్ఛిన్నం కాకుండా పటేల్ కాపాడారన్నారు. అనంతరం కాలేజీ విద్యార్థులు ఐక్యతా ప్రతిజ్ఞ చేసి, ఒక నిమిషం మౌనం పాటించి నివాళి అర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు వి.వీరయ్య, డాక్టర్ కోటేశ్వరయ్య, ఎ.నాగేశ్వరరావు, డాక్టర్ పి.సుజన తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రామ సమస్యలను సర్పంచ్‌లు అధ్యయనం చేయాలి:ఎంపిడిఒ

వెంకటగిరిరూరల్, అక్టోబర్ 30, ప్రభాతవార్త

గ్రామీణ ప్రాంతలల్లో అవసరం అయిన మౌళిక వసతులపై గ్రామ సర్పంచ్‌లు అధ్యాయనం చేసి నివేదిక మండల పరిషత్ కార్యలయంకు ఇవ్వాలని ఎంపిడిఒ కోటేశ్వరరావు తెలిపారు. ఎంపిడిఒ కార్యలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో వర్షాలు కురవడంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం పై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గ్రామ కార్యదర్శులకు సూచించారు. అదేవిధంగా తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామాల్లో అవసరం అయిన వసతుల గుర్తించి జిల్లా అధికారులకు నివేదిక పంపుతామని నిదులు మంజూరు అయిన వెంటనే పనులు చేసేవిధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

శ్రీ చైతన్య పాఠశాలలో ముందస్తు దీపావళి వేడుకలు

తిరుపతి విద్య, అక్టోబర్ 30,ప్రభాతవార్త:

స్థానిక న్యూ ఇందిరానగర్ శ్రీ చైతన్య పాఠశాల నందు క్యాట్ ఇలంపియాడ్ పరీక్షల్లో విద్యార్థులు విశేష ప్రతిభను ఘనపరిచారని ఆ విద్యాసంస్థల ఎజిఎం సురేష్ తెలిపారు. లెవల్ వన్‌లో ఉత్తీర్ణు లై లెవల్ 2కి ఏకంగా 150 మంది విద్యార్థులు ఎంపికయ్యారని వెల్లడించారు. మ్యాట్ కు 59 మంది,ఫ్యాట్ కు 47 మంది,చాట్ కు 49 మంది ఎంపికయ్యారని వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీవాణి జోనల్ కో ఆర్డినేటర్ ఏ బాలాజీ,జోనల్ డీన్ కాశిరావు,ఐకాన్ ఇన్చార్జి ఉపాధ్యాయిని,ఉపాధ్యాయులు,విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడలకు జిల్లా స్థాయి ఉద్యోగుల ఎంపిక

తిరుపతి క్రీడ, అక్టోబర్ 30, ప్రభాతవార్త

ఆలిండియా సివిల్ సర్వీసెస్ తిరుపతి జిల్లా స్థాయి ఉద్యోగుల ట్రయల్స్ కోసం క్రికెట్‌కు శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ నెల 29, 30వ తేదిలలో నిర్వహించారు. ఈ ఎంపికలో పురుషులు 38, మహిళా క్రీడాకారులు 9 మందిని ఎంపిక ట్రయ ల్స్‌కు హాజరైయ్యారు. మొత్తం 47 మంది ఖోఖో, కబడ్డీ, క్రికెట్, స్విమ్మింగ్, ఫుట్‌బాల్, వాలీబాల్, బాల్ అండ్ బెస్ట్ ఫిజిక్, డిస్టిక్ స్పోర్ట్స్ అధారిటీ ఆఫీసర్ సహేత్ సాహెబ్ ఆధ్వర్యంలో ఎంపిక జరిగింది. ఎంపికైన జిల్లా స్థాయి క్రీడాకారులను షెడ్యూల్ ప్రకారం విజయవాడలోని రాష్ట్ర స్థాయి ఎంపిక కమిటీకి నవంబర్ 6 నుండి 9వ తేది వరకు నివేదించడం జరుగుతుందన్నారు.

దీపావళికి ముస్తాబైన టపాసు దుకాణాలు

విజయపురం, అక్టోబరు 30 ప్రభాతవార్త:

మండలంలోని పన్నూరు సబ్‌స్టేషన్‌లో దీపావళికి టపాసు దుకాణం ముస్తాబైంది. దీపావళి నాడు వచ్చే అమావాస్య గడియలు గురువారం మధ్యాహ్నం 2.45కు ప్రారంభం కావడంతో సాయంత్రం సమయాల్లో నోములు నోచేవారు. అదే రోజున పండుగ చేసుకోనున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆలయాల్లో, ఇంట్లో నోములు నోచుకునేవారు శుక్రవారం చేయాలని నిశ్చయించుకున్నారు. రెండు రోజులు అమావాస్య రావడంతో కొంత సందిగ్ధం నెలకొంది. బుధవారం దీపావళిని పురస్కరించుకుని కిరాణా దుకాణాలు కిక్కిరించాయి. మండలం నుంచి నగరి, పిచ్చాటూరు పట్టణాలకు వెళ్లి సరకులు తెచ్చుకున్నారు.

తిరుపతి డివిజన్

ఎమ్మెల్యేపై సస్పెన్షన్ ఎత్తి వేయాలి - ఇళంగోవన్‌రెడ్డి

కేవీబీ పురం, అక్టోబరు 30 ప్రభాతవార్త:

సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలంపై ఉన్న సస్పెన్షన్ ఎత్తి వేయాలని పిచ్చాటూరు మండల క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధిలో ఎమ్మెల్యే ఆదిమూలం కీలక పాత్ర పోషించే వ్యక్తి అని జరగాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను ఎక్కడికక్కడ నత్తనడకన సాగుతున్నాయని, అదే విధంగా నిత్యం ఎల్లప్పుడు నియోజకవర్గం ప్రజలతో మమేకమవుతూ ప్రతి రోజు నియోజకవర్గ మొత్తం తిరిగే ఎమ్మెల్యేకి నియోజకవర్గంలోని సమస్యల పట్ల, అభివృద్ధి పట్ల పూర్తి అవగాహన ఉందని తెలిపారు. అధిష్టానం దీనిపై ఆలోచించి త్వరగా ఓ నిర్ణయం తీసుకుని ఎమ్మెల్యేపై సస్పెన్షన్ ఎత్తి వేసి నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే ద్వారా కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బాల్య వివాహాలకు దూరంగా ఉండాలి - ఎంపీడీవో

కేవీబీ పురం, అక్టోబరు 30 ప్రభాతవార్త:

నిషేధిత చట్టం 2006 అమల్లో ఉన్న నేపథ్యంలో బాల్య వివాహాలకు దూరంగా జీవించాలని కేవీబీ పురం మండల ఎంపీడీవో రాధారాణి తెలిపారు. మంగళవారం మండలంలోని ఒల్లూరు ఎస్టీ కాలనీలో స్థానిక సర్పంచ్ సురేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఫారెస్టు అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలు వలన కలిగే అనర్థాలను వివరించారు. షెడ్యూల్ తెగలు షెడ్యూల్ కులాలు వాటి వివరాలను వివరించారు. పోడు భూములు ఎవరి హక్కు అడవి హక్కుల చట్టాలు గిరిజనుల హక్కులు, అటవీ హక్కుల చట్టం ఎలా ఎవరికి ఎలా హక్కులు వస్తాయి అనేదానిపై జరిగిన ఫారెస్టు అధికారులు సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా 2005 నుంచి సాగు బడిలో ఉన్న భూములకు ప్రభుత్వం అధికారిక పట్టాలు మంజూరు చేసే అవకాశం ఉన్న నేపథ్యంలో సమావేశంలో ఐటీడీపీ భూమి హక్కు ఇంటి స్థల హక్కు లేకుండా నివాసాలకు కొనసాగిస్తున్నామని వారు అధికారుల దగ్గర వాపోయారు. ఎన్నో సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నప్పటికి అధికారులు పట్టాలు మంజూరు చేయడం లేదని ఆరోపించారు. కనీసం నివాసం ఉన్న ఇంటి స్థలాలకు పట్టాలు లేవని సాగు చేసుకుంటున్నా భూములకు పట్టాలు ప్రభుత్వం ఇవ్వడం లేదని వారు ఆరోపించారు. అనంతరం ఎంపీడీవో సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సమావేశంలో ఈవోపీఆర్‌డీ వల్లి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

స్వర్ణోత్సవ సంబరాల ర్యాలీ

నగరి, అక్టోబరు 30 ప్రభాతవార్త:

యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్(యూటీఎఫ్) స్వర్ణోత్సవ సంబరాల ర్యాలీని అసోసియేషన్ సభ్యులు బుధవారం నిర్వహించారు. నగరి ఓంశక్తి గుడి నుంచి టవర్‌క్లాక్ వరకు ర్యాలీ నిర్వహించిన పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వర్ణోత్సవ సంబరాలు నిర్వహించారు. యూటీఎఫ్ ఉపాధ్యాయుల కోసం సాధించిన విజయాలను జిల్లా కమిటీ వారు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎన్.మణిగండన్, సహ అధ్యక్షులు పి.ఆర్.మునిరత్నం, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్.పి.బాషా, జిల్లా కార్యదర్శి పార్థసారధి, ఆడిట్ కమిటీ సభ్యులు రవీంద్రబాబు, వెంకటేశులు, ప్రచురణ కమిటీ కన్వీనర్ బాలాజీ, నగరి, నింద్ర, విజయపురం మండలాల అధ్యక్షులు సంతోష్, శ్రీనివాసులు, రాజేష్, ప్రధాన కార్యదర్శులు జనార్ధన్, రూబన్, నాగేశ్వరావు, మహిళా కార్యదర్శులు చంద్రకళ, గాయత్రి, సుధ, దివ్య సీనియర్ నాయకులు కుప్పరాజు, యూటీఎఫ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు గొల్లపల్లి విద్యార్థులు ఎంపిక

పుత్తూరురూరల్, అక్టోబరు 30 ప్రభాతవార్త:

రాష్ట్ర స్థాయి పోటీలకు పుత్తూరు మండలంలోని గొల్లపల్లి జిల

ఇసుకను బొక్కేస్తున్నారు...అధికారులు చోద్యం చూస్తున్నారు!

రేణిగుంట, అక్టోబరు 30 ప్రభాతవార్త: రేణిగుంట మండలం తూకివాకం పంచాయతీకి చెందిన ఓ సీనియర్ టీడీపీ నేత తిరుపతికి వైసీపీ నేతతో కుమ్మక్కై ఇసుకను హాంఫట్టంటూ బొక్కిస్తున్నారన్న విమర్శలు రేణిగుంట మండలంలో షికార్లు చేస్తున్నాయి. ఇవి పుకార్లు అనుకుంటే తప్పులో కాలేసినట్టే వాస్తవమే అంటూ ప్రత్యక్ష సాక్షులు అంటున్నారు. సువర్ణముఖి నది సమీపంలోని ఓ ప్రైవేటు విద్యాసంస్థ వద్ద ఈ ఇసుక దందా సాగుతోంది. ఇక్కడి నుంచి నేరుగా చెన్నై, బెంగళూరులకు తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. చెన్నైకైతే ఒక లారీ లోడుకు లక్ష రూపాయలు, బెంగళూరుకు ఒకటిన్నర లక్ష రూపాయలు వసూలు చేస్తున్నారని బాహాటంగానే చర్చించుకుంటున్నారు. స్వర్ణముఖి సమీపం లోని రెండు వాగుల మధ్య ప్రభుత్వ భూమిలో ఇసుకని లోడేస్తున్నారని ప్రజలు అంటున్నారు. ఇక్కడికి వెళ్ళడానికి స్థానిక ప్రజలు భయపడుతున్నారు. కొంత మంది గుండాలు కాపలాగా ఉన్నారని, మరి కొంత మంది జాతీయ రహదారిపై కాపు కాస్తున్నారని తెలిసింది. తూకివాకానికి చెందిన ఒకరిద్దరు జరుగుతున్న అక్రమాన్ని ఫోటోలు తీయడానికి ప్రయత్నిస్తే ఫోటోలను డిలీట్ చేసే వరకు నిర్బంధించారని సమాచారం. ఒకటికి మించి జేసీబీలు ఇక్కడ నిరంతరంగా పని చేస్తున్నాయని, రోజుకు పదుల సంఖ్యలో లారీలు, ట్రాక్టర్లు ద్వారా ఇసుక తరలిస్తున్నారని, అందరికి తెలిసిన సత్యం, ఫ్రీ ఇసుక పాలసీతో అనుమతులు తెచ్చుకుని అందిన కాడికి ఇసుకను సదరు వ్యక్తులు గుటకాయస్వాహా చేస్తున్నారని విమర్శలు లేకపోలేదు. నేను నీతివంతుడిని గతంలో డప్పు కొట్టుకున్న సదరు సీనియర్ టీడీపీ నేత ఇప్పుడు చేస్తున్నది ఏమిటని ప్రశ్నించని వారు లేరు. ఆ నాయకుడు ఇలా చేస్తే ఎమ్మెల్యేకి చెడ్డ పేరు రాదా అంటూ పార్టీకి చెందిన నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహస్య ఒప్పంద వ్యాపారాలు ఎమ్మెల్యేకు తెలియకుండానే జరుగుతున్నాయి అన్నది అందరికి తెలిసిన సత్యం. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి జోక్యం చేసుకుని వారి ఆగడాలను అరికట్టకపోతే పార్టీకి చెడ్డ పేరు రావడం ఖాయమని కొంత మంది టీడీపీ నేతలు అభిప్రాయపడుతున్నారు. అవసరమైతే ఇసుక అక్రమ రవాణా సమాచారం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామంటున్నారు.

సభ్యత్వాలు అత్యధిక సంఖ్యలో చేయించాలి

టిడిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శీలం కిరణ్ కుమార్

గూడూరు, అక్టోబర్ 30 ప్రభాతవవార్త : గూడూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వాలు అత్యధిక సంఖ్యలో నాయకులు బూత్ కన్వీనర్లు చేయించి రాష్ట్రంలోనే నియోజకవర్గానికి మంచి గుర్తింపు తీసుకురావాలని టిడిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శీలం కిరణ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం గూడూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పట్టణ, చిల్లకూరు మండలాల టిడిపి నాయకులు బూత్ కన్వీనర్లు, క్లస్టర్ ఇంచార్జిలతో ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పార్టీ సభ్యత్వాలపై సమావేశం నిర్వహించారు. సభ్యత్వాలకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు. టిడిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శీలం కిరణ్ కుమార్ మాట్లాడుతూ టిడిపి పార్టీ సభ్యత్వాలు రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమయ్యాయని నాయకులు క్లస్టర్ ఇంచార్జిలు బూత్ కన్వీనర్లు ఎక్కువ సంఖ్యలో పార్టీ సభ్యత్వాలు చేయించాలని సూచించారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న వారు ప్రమాదవశాత్తు మృతి చెందితే 5 లక్షల రూపాయిలు వారి కుటుంబ సభ్యులకు ఇవ్వడం జరుగుతుందని నాయకులు అందరూ సమిష్టిగా ఎక్కువ సంఖ్యలో సభ్యత్వాలు చేయించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు నెలబల్లి భాస్కర్ రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర రెడ్డి, కొండూరు వెంకటేశ్వర్లు రాజు, బిల్లు చెంచురామయ్య, గుండాల లీలావతి, మట్టం శ్రావణి, శివకుమార్, దువ్వూరు రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుప్పం ప్రాంతంలో అగస్త్య ఫౌండేషన్ సేవలు మరువలేనివి

- ఎపిఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం

కుప్పం, అక్టోబర్ 30 ప్రభాతవార్త : కుప్పం ప్రాంతంలో అగస్త్య ఇ ంటర్నేషనల్ ఫౌండేషన్ సేవలు మరువలేనివని ఎపిఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. బుధవారం అగస్త్య ఆడిటోరియంలో జిల్లా,రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డు గ్రహీతల సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, అగస్త్య ఫౌండర్ ఛైర్మన్ రామ్‌జీ రాఘవన్, కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, తెదేపా రాష్ట్ర నేతలు డా॥ బిఆర్ సురేష్ బాబు, డా॥ వెంకటేష్‌లు హాజరయ్యారు. ఈసందర్భంగా వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం మాట్లాడుతూ కుప్పం ప్రాంతంలో పాతికేళ్ల క్రితం ఉన్నత ఆశయంతో స్థాపించిన అగస్త్య ఫౌండేషన్ సమాజంలో సైన్స్ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన పెంచుతోందన్నారు. మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరుగాంచిన దివంగత రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాం వ ంటి మహనీయులు అగస్త్య ఫౌండేషన్‌కు విచ్చేసి వారి సేవలను అభినందించడం గొప్ప విషయమన్నారు. అగస్త్య ఛైర్మన్ రామ్‌జీ రాఘవన్ సైన్స్ పురోభివృద్ధికి చేస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. ఛైర్మన్ రామ్‌జీ రాఘవన్ మాట్లాడుతూ 25ఏళ్లుగా జరుగుతున్న తమ సుదీర్ఘ ప్రయాణం గురించి వివరించారు. అనంతరం విద్యార్థులను ఘనంగా సత్కరించడంతో పాటు చెక్కును అందజేశారు. అగస్త్య సిబ్బంది పాల్గొన్నారు.

పండగలా తెదేపా సభ్యత్వ నమోదు

కోట,అక్టోబర్ 30 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఓ పండగలా కొనసాగుతుందని ఎన్‌డిసిబి మాజీ వైస్ చైర్మెన్ సినియర్ తెదేపా నాయకులు నల్లపరెడ్డి జగన్ మోహన్ రెడ్డి అన్నారు.బుధవారం మండలలోని ఊనగుంటపాలెం. విద్యానగర్ గ్రామాల్లో తెదేపా సభ్యత్వ నమోదు కర్యాక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలు ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఒక్కక్కో హామీని నేరవేర్చుతున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పదకాలు మెచ్చి సభ్యత్వాలు పెరుగుతున్నాయని జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. ప్రతి కార్యకర్తకి అండగా మేము ఉంటామని చంద్రబాబు నాయుడు లోకేష్ భరోసా ఇచ్చారని ఆయన తెలిపారు. ముందుగా జగన్‌మోహన్ రెడ్డి కి ఊనుగుంటపాళెంలో ప్రజలు అక్కడ ఘన స్వాగతం పలికారు. ఆయన ప్రతి కార్యకర్తను పేరు పేరును పలకరించారు. ఈ కార్యక్రమంలో తెదేపా జిల్లా బిసి సెల్ ప్రధాన కార్యదర్శి తీగల సురేష్‌బాబు,పుట్టయ్య వెంకటేశ్వర్లు,తదిరులు పాల్గొన్నారు.

విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం

చిత్తూరు, అక్టోబర్ 30 ప్రభాతవార్త: పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 26వ తేదీ పోలీస్ పిల్లలు, విద్యార్థులు, పోలీసులకు నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బుధవారం ఎస్పీ మణికంఠ చందోలు బహుమతులు ప్రదానం చేశారు. ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరిం చుకుని ఈ నెల 26వ తేదీన జిల్లా వ్యాప్తంగా వున్న పాఠశాలల్లోని విద్యార్థులు, పోలీసు కుటుంబాల్లోని పిల్లలు, పోలీసులతో కలిపి వ్యాస, వక్తృత్వ పోటీలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ సదర్భంగా సైబర్ నేరాల నియంత్రణలో యువత పాత్ర, ప్రస్తుత వాతావరణంలో పోలీసులకు సవాళ్ళు అనే అంశాలపై నిర్వహించిన ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతిగా చిత్తూరు పిసిఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియేట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పూతలపట్టు మండలం కొత్త వెంకటాపురం గ్రామంకు చెందిన కె.జశ్వంత్‌కు 5 వేల రూపాయలు, బంగారుపాళ్యం సెయింట్ మేరీ స్కూల్‌లో టెన్త్ చదువుతున్న మెహజబీన్‌కు ద్వితీయ బహుమతిగా రూ.3 వేలు, పలమనేరు పెద్దపంజాణికి చెందిన ఎస్.ఫసిహా ఫిర్దోస్‌కు తృతీయ బహుమతిగా రూ.2 వేల రూపాయను ఎస్పీ మణికంఠ చందోలు అందజేశారు.

హోంగార్డులకు హెల్మెట్లు వితరణ

చిత్తూరు, అక్టోబర్ 30 ప్రభాతవార్త: 30 మంది హోమ్‌గార్డులకు స్పెషల్ బ్రాంచ్ హెడ్‌కానిస్టేబుల్ మురళీ తన సొంత ఖర్చులతో హెల్మెట్లు కొనుగోలు చేసి ఇచ్చారు. ఎస్పీ మణికంఠ చందోలు ఈ హెల్మెట్లను హోమ్‌గార్డులకు బుధవారం అంద జేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ ప్రతి హెల్మెట్ వాడకం వెనుక ఒక జీవితం వుందని గుర్తించుకోవాలన్నారు. మీ ప్రాణాలు మీ చేతుల్లోనే వున్నాయని, వీటిని రక్షించుకోవాల్సిన బాధ్యత మీపై వుందన్నారు. ప్రజలు మాత్రమే కాదు పోలీసులు ఎవరైనా హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలు నడుపుతూ పట్టుబడితే వారికి సైతం జరిమానా వేస్తామని స్పష్టం చేశారు. హెల్మెట్ ధరించడం ఒక భద్రత ఇది మన ప్రాణాలను కాపాడే రక్షణ కవచమన్నారు. 30 మంది హోమ్‌గార్డులకు హెల్మెట్‌లు వితరణ చేసిన ఎస్‌బి హెడ్‌కానిస్టేబుల్ మురళీని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఆర్.శివనందకిషోర్, చిత్తూరు డిఎస్పీ సాయినాథ్, ఏఆర్ డిఎస్పీ మహబూబ్‌భాషా, నగర ఇన్స్‌పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్ఐలులు పాల్గొన్నారు.

రేపు ఉచిత గ్యాస్ సిలెండర్ రీ-ఫిల్లింగ్ పథకం ప్రారంభం

- గుడిపాల జడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి హాజరు

- ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు

చిత్తూరు, అక్టోబర్ 30 ప్రభాతవార్త: ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ వాగ్దానాల్లో భాగంలో ఒకటైన ఉచిత గ్యాస్ రీ-ఫిల్లింగ్ కార్యక్రమంను శుక్రవారం గుడిపాల జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి వినియోగదారులకు అందించనున్నారని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. ఎన్నికల హామీలో భాగంగా ప్రతి ఏడాది ఉచితంగా మూడు గ్యాస్ సిలెండర్లు పంపిణీ చేస్తామని సిఎం చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాదిలో ప్రస్తుతం మొదటి గ్యాస్ సిలెండర్‌ను దీపావళి పండుగ పురస్కరించుకుని ఉచితంగా పంపిణీ చేయనున్నామన్నారు.

సిఎం చంద్రబాబును కలసిన మాజీ ఎమ్మెల్సీ గౌనివారి

- వరదబాధితులకై దాతలసాయంతో 14.36లక్షల చెక్కు అందజేత !!



శాంతిపురం, అక్టోబర్ 30 ప్రభాతవార్త : సిఎం చంద్రబాబునాయుడును మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఉండవల్లిలో సిఎంను కలసిన గౌనివారి ఈసందర్భంగా విశ్రాంత బిజిఎంఎల్ ఉద్యోగి కెఆర్ఎం రెడ్డి, బద్వేలుకు చెందిన సూర్య నారాయణరెడ్డి, నెల్లూరుకు చెందిన రాజశేఖర్‌రెడ్డి తో పాటు మరో పదిహేను మంది విజయవాడ వరద బాధితుల సహాయార్థం అందించిన రూ 14.36లక్షల చెక్కును సిఎంకు అందజేశారు. ఈసందర్భంగా కుప్పం నియోజకవర్గంలో జరుగు తున్న అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీ సభ్యత్వంపై సిఎం చంద్రబాబు అడిగి తెలుసుకున్నట్లు గౌనివారి తెలిపారు. వరద బాధితులకు విరాళాలు ఇచ్చిన దాతలను సిఎం చంద్రబాబు అభినందించారని తెలిపారు.

గత పాలకులు తప్పిదాలతోనే.. మనకు అధికారం : ఎస్‌సివి

శ్రీకాళహస్తి,అక్టోబర్ 30 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గం శాంతికి చిహ్నమని ఇక్కడ పండగలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తారని మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు అన్నారు. బుధవారం ఆయన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ దీపావళి పండగను కులాలు మతాలకు భిన్నంగా జరుపుకునే పండగ అన్నారు. సమాజాన్ని పట్టి పీడించిన రాక్షస పాలన అంతమొందించిన సమయంలో ప్రజలు జరుపుకున్న సంబరాలని వివరించారు.అలాగే మన రాష్ట్రానికి ఐదేళ్ళ పాటు పట్టిపీడించిన రావణాసురుని పాలనకు స్వస్తి చెప్పి కూటమి ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టారన్నారు.కానీ ఆ పాలనను చూసిన జనం మౌనంగా తమ తీర్పును ఇచ్చి రాక్షసపాలనను ఆమోదించమని చాటిచెప్పారన్నారు. కూటమి ప్రభుత్వానికి స్వచ్ఛందంగా ఓటు వేసింది 40శాతం మాత్రమే అని మిగిలిన 60శాతం మంది వైకాపా పాలనపై వ్యతిరేకంగా ఆ రాక్షస పాలన మళ్ళి వస్తే తమ బతుకులు ఘోరంగా ఉంటాయని భావించి గొప్ప తీర్పు ఇచ్చారని ఎస్‌సివి నాయుడు వివరించారు. పాలనను పారదర్శకంగా నిర్వహిం చుటకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డెప్యూటి ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి పడుతున్న కష్టాన్ని పార్టీ సహాచరులు గుర్తించుకొని పాలనలో పారదర్శకతను పాటించాలన్నారు.శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో మనం ఉండటం అదృష్టమన్నారు. దీపావళి పండగను అందరూ సుఖ సంతోషాలతో జరుపుకోవాలని పిలుపు నిచ్చారు.

రేణిగుంట కీర్తిని హైదరాబాద్‌లో చాటిన రాజేష్

రేణిగుంట, అక్టోబరు 30 ప్రభాతవార్త: రేణిగుంట మండల కీర్తి బావుటాను తెలంగాణ రాష్ట్రం రాజధాని నగరం హైదరాబాద్‌లో ఎగురవేసిన రేణిగుంట మండలం జీవాగ్రంకు చెందిన పసేలి రాజేష్‌ను రేణిగుంట మండల ప్రజలు అభినందిస్తున్నారు. రేణిగుంట మండలం జీవాగ్రం గ్రామానికి చెందిన రాజేష్ రక్తదానంపై అవగాహన కల్పించడంలో ఇప్పటికే పలువురు మన్ననలు పొందారు. రక్తదానం కోసం ప్రజలు ముందుకు వచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి వారిని ప్రేరేపించేందుకు విశేష కృషి చేసిన రాజేష్ సేవలకు గుర్తింపు లభించింది. జాతీయ స్థాయిలో హైదరాబాద్ పొట్టి శ్రీరాములు ఎన్‌టీఆర్ కళా ప్రాంగణంలో యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వి.సి.సజ్జనార్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. అవార్డు రావడానికి సిఫార్సు చేసిన బ్లడ్ డోనర్స్ అసోసియేషన్ చైర్మన్ బాలుకు రాజేష్ ధన్యవాదాలు తెలియజేశారు.

తెలంగాణ సిఎం సతీమణికి ఘన స్వాగతం

శ్రీకాళహస్తి,అక్టోబర్ 30 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సతీమణి గీతారెడ్డి భక్తి శ్రద్ధలతో మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి గీతారెడ్డికి ఆలయ ఇఓ ఎస్ ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ సారధ్యంలో ఆలయ ఉద్యోగులు ఘన స్వాగతం చెప్పారు. దక్షిణ గోపురం వద్ద ప్రోటోకాల్ మేరకు ఇఓ ఆజాద్ స్వాగతం చెప్పారు. ఏర్పాట్లును ఇఓ ఆదేశాలతో ఎఇఓ సతీష్‌మాలిక్,టెంపుల్ ఇన్స్పెక్టర్ హరియాదవ్, సిఎస్ఓ నాగభూషణం యాదవ్‌లు పర్యవేక్షించారు. రాహుకేతుదోష నివారణ పూజలు, అంతరాలయ దర్శనాలకు ఇఓ ఆజాద్ వ్యక్తిగతంగా పర్యవేక్షించారు.తరువాత ఆలయ మర్యాదలతో శేష వస్త్రాలను వేదపండితులచే ఆశీర్వచనాలు అందించారు.తీర్థ ప్రసాదాలను అందించారు.

ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు అనుకూలం : ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్

పుత్తూరు, అక్టోబరు 30 ప్రభాతవార్త : ఆం ధ్రప్రదేశ్ రాష్ట్రం పెట్టుబడులకు అనుకూలమని నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ అన్నారు. రాష్ట్రాభివృద్ధికి పెట్టుబడులు ఆకర్షించేందుకు రాష్ట్ర ఐటి, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌తో కలిసి భానుప్రకాశ్ అమెరికాలో వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తున్నారు. ఆ మేరకు మంగళవారం అమెరికాలోని లాస్ వేగాస్ నగరంలో నిర్వహించిన ఐటి సర్వ్ అలయెన్స్ సినర్జీ - 2024 కాన్ఫరెన్స్‌లో మంత్రి నారా లోకేష్ కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల్లోనే పెట్టుబడులను ఆకర్షించే విధంగా ఆరు నూతన పాలసీలను రూపొందించామని తెలిపారు. రాష్ట్రంలో ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ, రెన్యువబుల్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్స్, మాన్యుఫాక్చరింగ్, ఫార్మా తదితర రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు అనుకూలమైన పరిస్థితులు వున్నాయని తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే పారిశ్రామిక వేత్తలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు కేవలం 21 రోజుల్లోనే పాలనాపరమైన అనుమతులు మంజూరు చేస్తామని వివరించారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రవాసాంధ్రులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

చిత్తూరు జిల్లా కబడ్డీ జట్టుకు ప్రోత్సాహకాలు

చౌడేపల్లి, అక్టోబర్ 30 ప్రభాతవార్త : రాష్ట్ర స్థాయి అండర్-17 బాలికల కబడ్డీ పోటీల్లో విజయ కేతనం ఎగరేసిన చిత్తూరు జిల్లా బాలికల జట్టుకు విరివిగా ప్రోత్సాహకా లందించారు. మండల తేదేపా అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి రూ. 10వేలందించగా, కెసి నవీన్‌బాబు, ఆయన సతీమణి మోనికా వారికి జాతీయస్థాయిలో ఆడేందుకు అవరసమైన క్రీడావస్తువుందిస్తామన్నారు. క్రీడాకారులు, క్రీడాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని గువ్వల రమేష్‌రెడ్డి అన్నారు. ప్రధానోపాధ్యాయుడు నాగరాజురెడ్డి, పిఇటి రాజేంద్ర, ఉపాధ్యాయులు మురళి, ఈశ్వర్, సుధాకర్, తేదేపా నాయకులు పవన్‌కుమార్, అర్జున్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అందరి జీవితాల్లో శ్రేయస్సు శాంతిని కలిగించాలి

-శాప్ ఛైర్మన్ రవినాయుడు

తిరుపతి, అక్టోబర్ 30ప్రభాతవార్త: రాష్ట్రంలోని ప్రజలందరి జీవితాల్లో దీపావళి శ్రేయస్సు, సంతోషం, శాంతిని కలిగించాలని శాప్ ఛైర్మన్ ఎ.రవినాయుడు ఆకాంక్షించారు. దీపావళి వెలుగులు అందరిలో ఉజ్జ్వల భవిష్యత్తువైపు నడిపించాల న్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారధ్య ంలో రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులుతీస్తోందని, త్వరలోనే రాష్ట్రంలో క్రీడలను మరింతగా అభివృద్ధిచేస్తానన్నారు. అన్ని రకాల ముందు జాగ్రత్తలతో ప్రజలు పండుగను జరుపుకోవాలని రవినాయుడు కోరారు.

తుడాలో ఘనంగా ఆయుధపూజ

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 30 ప్రభాతవార్త : తిరుపతి పట్టాణాభివృద్ధి సంస్థలో బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ ఉపాధ్యక్షులు ఎన్. మౌర్య వాహనాలకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షులు ఎన్. మౌర్య మాట్లాడుతూ ఈ దీపావళి వేళ అందరి కుటుంబాల్లో వెలుగులు నిండలాని, అందరూ ఆయురారోగ్యాలతో జీవించాలని అన్నారు. అందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఆయుధపూజ కార్యక్రమంలో తుడా సెక్రటరీ వెంకట నారాయణ, సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్రయ్య, ఎల్ఏఓ సుజన, ఏఏఓ సుగుణ, పిఓ దేవికుమారి, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తాం

ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ ఎన్. మౌర్య

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 30 ప్రభాతవార్త : నగరంలో పారిశుద్ధ్యం పెంపొందించి, పచ్చదనం పెంచడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకమైందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు అన్ని విధాల కృషి చేస్తామని నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య అన్నారు. బుధవారం స్థానిక కచ్చిపి అడిటోరియంలో స్వచ్ఛ దివాళి, శుభ దివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ ఎన్. మౌర్యలు పాల్గొని పారిశుద్ధ్య కార్మికులకు పిపిఈ కిట్లు, రక్షణ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దీపావళి పండుగను నగర ప్రజలందరూ సుఖ సంతోషాలతో జరుపుకోవాలన్నారు. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిరుపతి పుణ్యక్షేత్రానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. వారందరూ కూడా తిరుపతినగరంలలో పారిశుద్ధ్యాన్ని పరిశీలిస్తూ ఉంటారని అన్నారు. నగర పాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు చక్కగా పనిచేస్తూనే తిరుపతి పవిత్రత పరిశుభ్రత ఉంచాల్సిన బాధ్యత మీ చేతుల్లోనే ఉందన్నారు. ఆరోగ్య పరిరక్షణ కోసం ఐఓసిఎల్ కంపెనీతో తీపి కిట్లు పంపిణీ చేస్తున్నమన్నారు. వృత్తిపరంగా మీకే సమస్యలు ఉన్న మీ హెల్త్ ఆఫీసర్ ఐనా, నన్ను కలిసి తెలిపితే వెంటనే పరిష్కరిస్తామన్నారు. మీకు పెన్షన్, పిఎఫ్ వంటివి సక్రమంగా జమ అయ్యేలా అన్ని చర్యలు చేపట్టామన్నారు. మీరు ఆరోగ్యంగా ఉంటూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలలో తుడా మాజీ చైర్మన్ నరసింహ యాదవ్, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాం సుందర్, మున్సిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డిఈలు మధుబాబు, రమణ, శానిటరీ సూపర్‌వైజర్లు చెంచయ్య, సుమతి, హోటల్ యాజమాన్యం సంఘం నాయకులు అంజి, సత్య, తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు దండి..తనిఖీలు లేవండి!

శ్రీసిటీలో రవాణాశాఖ తీరు ఇది

సత్యవేడు, అక్టోబరు 30 ప్రభాతవార్త: సత్యవేడు శ్రీసిటీ పరిధిలో రవాణా శాఖ పని తీరుపై తీవ్ర స్థాయి విమర్శలు వస్తున్నాయి. ప్రధానంగా ఈ ప్రాంతంలో తిరుగుతున్న వాహనాలు, ఆ వాహనాలకు సంబంధించి ఇన్సూరెన్స్, ఆర్‌సీ రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్‌లను ఎప్పటికప్పుడు పరిశీలిం చడం చేపట్టాలి అటువంటి వ్యవహారాలను ఆ శాఖ అధికారులు విస్మరించడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదని పలువురు వాపోతున్నారు. అదే సందర్భంలో ప్రమాదాల్లో గాయపడ్డ వారికి చికిత్స చేయడం కోసం ఇన్సూరెన్స్ నగదు కూడా జమ కాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా శ్రీసిటీ పరిధిలో సుమారు 220 పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో పని చేయడానికి పలు ప్రాంతాల నుంచి కార్మికులు, ఉద్యోగులు వివిధ వాహనాల్లో రావడం జరుగుతుంది. చెన్నై-తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, తడ, మరికొన్ని ప్రాంతాల నుంచి కూడా ఎక్కువ మంది రోజు వివిధ వాహనాల్లో ఇక్కడిక